ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
1



విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025

జల్లులతో చల్లబడిన వాతావరణం

- 5, 6 తేదీల్లో ఉత్తరకోస్తాకు వర్షసూచన

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల ప్రభావంతో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా నగరంపై మబ్బులు కమ్మేశాయి. సాయంత్రం వరకూ మేఘాలు ఉన్నాయి. నగరంలో చిన్నపాటి జల్లులు కురవగా, శివారు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో నగరవాసులు సేదతీరారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 5, 6 తేదీల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

హైకోర్టు ఏజీపీగా పాల అశోక్‌రెడ్డి



పాల అశోక్‌రెడ్డి

గాజువాక, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన పాల అశోక్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. అశోక్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు, విశాఖ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తి రాజశేఖర్‌కు అశోక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డు

- కేజీహెచ్‌లో నాలుగు పడకలతో ఏర్పాటు
- శరీరం వేడిగా మారినా, ఊపిరి సలపనట్టు అనిపించినా అప్రమత్తం కావాలని వైద్యుల హెచ్చరిక

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఈ నెలలో మరింత పెరిగే అవకాశం ఉన్నందున వడదెబ్బ బాధితులకు తక్షణం చికిత్స అందించేందుకు కేజీహెచ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నాలుగు పడకలతో ప్రత్యేకంగా హీట్ స్ట్రోక్ వార్డును సిద్ధం చేశారు. క్యాజువాల్టీ బిల్డింగ్‌లోని మొదటి అంతస్థులో ఈ వార్డును ఏర్పాటుచేశారు. కేజీహెచ్ జనరల్ మెడిసిన్, అత్యవసర విభాగానికి వచ్చే వడదెబ్బ బాధితులకు ప్రత్యేక వార్డులో వైద్యం అందిస్తారు. గడిచిన కొద్దిరోజులుగా వాతావరణం మారిందని, ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం



వడదెబ్బ బాధితులకు కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

ఉందన్న ముందస్తు హెచ్చరికలతో హీట్ స్ట్రోక్ వార్డు ఏర్పాటుచేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద వెల్లడించారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా లిక్విడ్ ఆహారాన్ని తీసుకోవాలని జనరల్ మెడిసిన్ డాక్టర్ నవీన్ సూచించారు. ఆరుబయట పనిచేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలైనంత వరకూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ పనికి విశ్రాంతి ఇవ్వాలన్నారు. ఆ సమయంలో నీడ ప్రాంతాల్లో ఉండే పనులు చేయడం మంచిదన్నారు. శరీరం వేడిగా మారినా, తీవ్రమైన ఉక్కపోత వేధించినా, ఊపిరి సలపనట్టు అనిపించినా అప్రమత్తం కావాలని సూచించారు. వైద్యుల వద్దకు వెళ్లి వారి సూచనల మేరకు చికిత్స పొందాలన్నారు.

ఆకాశంలో హరివిల్లు



శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో జ్ఞానాపురం వద్ద కనిపించిన ఇంద్రధనస్సు

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

సింహగిరిపై ప్రమాదానికి దారితీసిన కారణాలెన్నో...

- ఆలయ పరిపాలనలో అనుభవం లేని అధికారికి ఇన్‌చార్జి ఈఓ బాధ్యతలు
- పనులు పూర్తికాని మార్గంలో రూ.300 క్యూలైన్
- డిప్యుటేషన్‌పై వచ్చిన దేవదాయ సిబ్బందికి విధుల కేటాయింపులో వైఫల్యం
- చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను కార్యాలయానికి పరిమితం చేసిన వైనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం రోజున ప్రమాదం జరగడానికి, భక్తులకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడానికి కారణాలు ఏమిటి?, బాధ్యులు ఎవరు? అనే దానిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. గోడ కూలి ఏడుగురు మరణించిన ఘటనపై త్రిసభ్య కమిటీ ప్రాథమిక విచారణ పూర్తిచేసింది. ఆ కమిటీ కొండపై తొలిరోజు (గురువారం) ఎనిమిది మందిని, రెండో రోజు శుక్రవారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో 11 మందిని విచారించింది. మొత్తం 19 మందిలో 15 మంది వివిధ శాఖల అధికారులు కాగా మిగిలిన నలుగురు ప్రైవేటు వ్యక్తులు. వారిలో వైజాగ్ వలంటీర్స్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు కూడా ఉన్నారు. చందనోత్సవంలో ఈ సంస్థ సభ్యులే పెద్ద సంఖ్యలో సేవలు అందించారు.



సింహగిరిపై కూలిన గోడ (ఫైల్ ఫొటో)

అనుభవం లేని వ్యక్తికి బాధ్యతలు

ప్రస్తుతం సింహాచలం ఇన్‌చార్జి ఈఓగా వ్యవహరిస్తున్న కె.సుబ్బారావు రెవెన్యూ అధికారి. గత ఏడాది మే నెలలో తొలిసారిగా దేవదాయ శాఖకు డిప్యుటేషన్‌పై వచ్చారు. రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు ఆదాయం వచ్చే ఆలయాలకు బడ్జెట్ కేటాయింపు, సిబ్బందికి సెలవులు ఇవ్వడం వంటివి ఆయన చూస్తారు. ఆయనకు ఏ ఆలయంలోను ప్రధాన ఉత్సవాలు నిర్వహించిన అనుభవం లేదు. ఆలయ పరిపాలనలో కనీస పరిజ్ఞానం లేదు. అటువంటి అధికారిని తీసుకువచ్చి సింహాచలంలో చందనోత్సవం జరుగుతున్న సమయాన ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులు ఇచ్చింది ఎవరు?, అందుకు కారణాలు ఏమిటి?...అనే దానిపై కమిటీ ఆరా తీసింది.

పనులు పూర్తి కాని మార్గంలో రూ.300 క్యూలైన్

ఉత్సవానికి వచ్చే భక్తుల సంఖ్యను బట్టి ఏర్పాట్లు దేవస్థానం అధికారులే చేయాలి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉచిత, రూ.300, రూ.1,000, రూ.1,500 క్యూలైన్లు ఏర్పాటుచేశారు. అయితే రూ.300 క్యూలైన్ ఏటా జోడుభద్రాలు వద్ద నేరుగా పైకి ఉండే మెట్ల మీదుగా వెళుతుంది. కానీ అక్కడ ఇప్పుడు 'ప్రసాద్' పనులు జరుగుతున్నందున నేరుగా పైకి వెళ్లే అవకాశం లేదు. అందువల్ల దానిని వేరే మార్గంలోకి మళ్లించాల్సి ఉంది. కానీ ఆలయ అధికారులు ఆ పని

... మిగతా 2వ పేజీలో

చందనోత్సవ నిర్వహణలో లోపాలు అనేకం!

- ముందురోజు అర్ధరాత్రి వరకూ టికెట్ల విక్రయం
- ఎమ్మెల్యేలకు రాత్రి 10 గంటలకు జారీ
- అధికారుల నిర్వాకంపై ప్రజా ప్రతినిధుల అసంతృప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం నిర్వహణలో కూడా అనేక లోపాలు ఉన్నాయి. అయితే గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన నేపథ్యంలో వాటిపై ఎవరూ దృష్టి పెట్టలేదు. వాస్తవానికి దేవదాయ శాఖ అధికారుల నిర్వాకంపై ప్రజా ప్రతినిధులతో పాటు నగర ప్రముఖులు చాలా అసంతృప్తిగా ఉన్నారు. అధికారుల తీరు నచ్చక స్థానిక ఎమ్మెల్యేనే దర్శనానికి వెళ్లకుండా ఉండిపోయారంటే వారు ఎలా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

రెండు వారాల ముందే ప్రకటన

చందనోత్సవం ఎప్పుడు నిర్వహించేది నెల రోజుల ముందే ప్రకటించారు. దర్శనం టికెట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పది రోజుల ముందు ప్రకటించారు. నాలుగు రోజుల ముందు సింహాచలం బ్యాంకుల్లో రూ.300, వేయి రూపాయల విలువైన టికెట్ల విక్రయం ప్రారంభించారు. రూ.1,500 టికెట్లు 2,500 మాత్రమే ముద్రించామని, వాటిని వీవీపీలకు మాత్రమే ఇస్తామని చెప్పారు. నగరంలో ప్రముఖులు, దాతలు రూ.1,500 టికెట్లు కావాలని, మరికొందరు వేయి రూపాయల టికెట్లు కావాలని దరఖాస్తు చేసుకుంటే వారికి ఉత్సవం ముందు రోజు అంటే మంగళవారం మధ్యాహ్నం వరకూ

... మిగతా 2వ పేజీలో

73,000

ఇదీ జిల్లాలో నిరుపేద కుటుంబాల సంఖ్య

- పీ-4 సర్వేలో గుర్తించిన అధికారులు
- బంగారు కుటుంబాలుగా నామకరణం
- ప్రతి కుటుంబానికి బాసటగా నిలిచేందుకు మార్గదర్శకుల ఎంపిక కోసం కసరత్తు

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలకు అన్ని విధాలుగా చేయూతనిచ్చేందుకు చేపట్టిన పీ-4 సర్వేలో జిల్లాలో 73 వేల బంగారు కుటుంబాలను అధికారులు గుర్తించారు. వారిని అన్నివిధాలా ఆదుకునేందుకు మార్గదర్శకులుగా జిల్లాలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, విదేశాలలో నివాసం ఉంటున్న వారిని ఎంపిక చేయనున్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతి జిల్లాలో బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారికి ఆయా ప్రాంతాల్లో ఉన్నత వర్గాలు అంటే ఆర్థికంగా స్థితిమంతులను మార్గదర్శకులుగా గుర్తించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపకల్పన చేశారు. ఇందుకుగాను అన్ని జిల్లాల్లో పీ-4 సర్వే రెండు నెలల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం సర్వే దాదాపు చివరి దశకు వచ్చింది. పీ-4 సర్వే కోసం పలు రకాల ప్రామాణికాలు, సంక్షేమ పథకాలను పరిగణనలోకి తీసుకుని 4,09,948 కుటుంబాలతో జాబితా రూపొందించారు. ఈ 4,09,948 కుటుంబాల్లో ఇంతవరకూ 4,08,161 (99.6 శాతం) కుటుంబాలను సర్వే చేశారు. ఇతరుల నుంచి



నగరంలో పీ-4 సర్వే చేస్తున్న బృందం

పలు విధాలుగా సాయం పొందేందుకు 3,10,925 కుటుంబాలు మాత్రమే ముందుకు వచ్చాయి. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం 3,10,925 వేల కుటుంబాల జాబితాను మరింత వడపోసి సమాజంలో అత్యంత పేదలుగా ఉన్న 73,000 కుటుంబాలను ఎంపిక చేసింది. విద్యాపరంగా, జీవన స్థితిగతులపరంగా 73 వేల కుటుంబాలు అత్యంత పేదలుగా నిర్ధారించింది. ఈ కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ప్రభుత్వం నామకరణం చేసింది. వీరిలో అత్యధికులు మురికివాడల్లో నివాసం ఉంటున్నవారు, అపార్టుమెంట్‌లలో పనిచేసే వాచ్‌మెన్‌లు, భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, ఇతరత్రా చిన్నచిన్నపనులు చేసుకునేవారు ఉన్నారు. ఇటువంటి కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవడం ద్వారా పేదరికం నుంచి బయటకు

... మిగతా 2వ పేజీలో

నేడు నీట్

- 7,344 మంది అభ్యర్థులు, 16 కేంద్రాలు
- మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం
- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిందిగా అధికారుల సూచన
- ఒంటి గంటకు గేట్లు మూసివేత

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ డిగ్రీ (ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయూష్)లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'నీట్' ఆదివారం నగరంలోని 16 కేంద్రాల్లో జరగనున్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రవేశ పరీక్షకు 7,344 మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. అభ్యర్థులను ఉదయం 11 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒంటి గంట తరువాత గేట్లు మూసివేస్తారు. అంటే గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 'నీట్'కు సంబంధించి మల్కాపురం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లుచేసింది. ప్రతి రెండు కేంద్రాలకు ఒక తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా, ప్రతి ఎనిమిది కేంద్రాలకు ఒక ఆర్డీవోను పర్యవేక్షకునిగా నియమించారు. పరీక్ష నిర్వహణపై జిల్లా ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఆర్డీవోలు,తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

కార్యరూపం దాల్చని ఓషన్ డెక్

- సీఆర్‌జెడ్ అనుమతుల కోసం నిరీక్షణ
- ఏడాది నుంచి ఏపీసీజెడ్ఎంఏ వద్ద పెండింగ్
- ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వద్ద...
- పూర్తయితే పర్యాటకులకు మధురానుభూతిని పంచనున్న ప్రాజెక్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పర్యాటకులను ఆకట్టుకునేలా 'ఓషన్ డెక్' ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రకటించి 22 నెలలైంది. ఇప్పటివరకూ దానికి శంకుస్థాపన కూడా చేయలేకపోయింది.

ఆర్కే బీచ్ రోడ్డులో వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక పాత లైట్ హౌస్ వద్ద ఓషన్ డెక్ నిర్మిస్తామని 2023 జూలైలో ప్రకటించారు. అది కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉన్న భూమి. అక్కడ నిర్మాణాలు ఏమైనా చేపట్టాలంటే ఢిల్లీలోని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఇందుకోసం పరివేశ్ పోర్టల్‌లో వీఎంఆర్‌డీఏ అధికారులు ప్రాజెక్టు వివరాలు పొందుపరిచారు. ఇలాంటి వాటిపై ముందుగా ఆయా రాష్ట్రాలకు చెందిన కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీజెడ్ఎంఏ) సమీక్షించి, అనుమతి ఇవ్వవచ్చునని సిఫారసు చేస్తే, అప్పుడు ఢిల్లీలోని అధికారులు పరిశీలిస్తారు. ఈ క్రమంలో ఏపీ సీజెడ్ఎంఏ అధికారులు ఏడాది పాటు దీనిని వెయిటింగ్‌లో ఉంచి, ఇటీవలె కేంద్ర సంస్థకు సిఫారసు చేశారు. అక్కడ ఇంకెంతకాలం ఆ ఫైల్ ఉంటుందో తెలియదు. వారు కూడా పచ్చజెండా ఊపితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుంది. వాటి కోసమే వేచి చూస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి ఆరు నుంచి తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు.



ఓషన్ డెక్ ప్రాజెక్టు నమూనా

ఇదీ ప్రాజెక్టు

వీఎంఆర్‌డీఏ

... మిగతా 2వ పేజీలో

డిగ్రీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు ఆంధ్ర విశ్వ విద్యాలయం అధికారులు ప్రకటించారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం విద్యార్థులకు రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల ఆరో తేదీ నుంచి నిర్వహించేందుకు తొలుత షెడ్యూల్ విడుదల చేశారు. అయితే, అదే తేదీల్లో కొన్ని ప్రవేశ పరీక్షలు జరగనుండడంతో షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు శనివారం ప్రకటించారు. ఈ నెల ఆరో తేదీ ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 21న ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈ నెల ఏడో తేదీన ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన పరీక్షలను 22న అదే సమయాల్లో నిర్వహిస్తారు. అలాగే, ఈ నెల 19న ఉదయం, మధ్యాహ్నం జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను 23న, 20న ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జరగాల్సిన రెండు, నాలుగో సెమిస్టర్‌కు సంబంధించిన మూడు పరీక్షలను 24న అదే సమయాల్లో నిర్వహించ నున్నట్టు అధికారులు వెల్లడించారు. ఏయూ అనుబంధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు ఈ విషయాన్ని గుర్తించాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.చిట్టి బాబు ఒక ప్రకటనలో కోరారు.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

దువ్వాడ జంట హత్యల కేసులో వీడిన మిస్టరీ

- నిందితుడు ఒడిశా వాసి
- మృతురాలితో వివాహేతర సంబంధం
- ఆభరణాల కోసమే ఆమెను చంపాడు
- ఆ దారుణం చూశాడని ఆమె భర్తను హత్య చేశాడు

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ సమీపాన గల రాజీవ్ కాలనీలో వారం కిందట జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసుని పోలీసులు ఛేదించారు. మహిళ మెడలోని ఆభరణాలను దొంగిలించేందుకు ఆమెతో సన్నిహిత సంబంధం కలిగిన వ్యక్తే హత్యకు పాల్పడినట్టు నిర్ధారించారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, రూ.4.18 లక్షల నగదు, హత్యకు వాడిన కత్తిని పోలీసులు స్వాధీనం చచేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ శంఖబ్రతబాగ్చి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

గంపల యోగేంద్రబాబు (66), ఆయన భార్య లక్ష్మి (58) కలిసి దువ్వాడలోని రాజీవ్‌కాలనీలో సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన ప్రసన్నకుమార్‌మిశ్రా (58) కూడా వారి ఇంటికి సమీపంలోనే నివాసం ఉండేవాడు. పక్కపక్క ఇళ్లు కావడంతో ప్రసన్నకుమార్‌మిశ్రా భార్య, గంపల లక్ష్మి స్నేహంగా ఉండేవారు. కొవిడ్ సమయంలో ప్రసన్నకుమార్‌మిశ్రా భార్య మరణించడంతో అతను ఇల్లు ఖాళీ చేసి ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఒక డార్మెటరీలో ఉంటున్నాడు. రాజీవ్ కాలనీలో ఉన్నప్పుడే ప్రసన్నకుమార్‌మిశ్రాకు గంపల లక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ సంబంధం కొనసాగిస్తూ వచ్చారు. ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా అప్పులు చేసేశాడు. వాటిని తీర్చేందుకు ఆభరణాలు ఇవ్వాల్సిందిగా లక్ష్మిని కోరగా, ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను చంపేసి ఆభరణాలను తీసుకువెళ్లాలని ప్రసన్నకుమార్‌మిశ్రా పథకం రచించాడు. గత నెల 24న గాజువాకలోని ఒక సూపర్‌మార్కెట్‌కు వెళ్లి

... మిగతా 2వ పేజీలో



హత్య కేసులో నిందితుడు ఉపయోగించిన కత్తిని చూపుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

వివాహేతర సంబంధమే కారణం...

- దాకమర్రి లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసుని ఛేదించిన పోలీసులు
- హతురాలు మారికవలస రాజీవ్ గృహకల్పకు చెందిన వివాహిత
- అదే ప్రాంతంలో ఉంటున్న వ్యక్తితో వివాహేతర సంబంధం

-3లో


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణం, చందనోత్సవం పురస్కరించుకుని గత నెల 7వ తేదీ నుంచి రద్దు చేసిన ఆర్జిత సేవలను శనివారం నుంచి పునఃప్రారంభించారు. ఈమేరకు వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవింద రాజ స్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు.

సంగివలస చెరువు శుభ్రం


చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

తగరపువలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని సంగివలసలో ఉన్న కొండప్ప చెరువును జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు శనివారం శుభ్రం చేశారు. రెండు రోజుల క్రితం ఈ చెరువులో చేపలు చనిపోయిన విషయం తెలిసిందే. చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తక్షణమే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు పారిశుధ్య సిబ్బంది చెరువులో చనిపోయిన చేపలను తొలగించి, నాచు, ఇతర వ్యర్థాలను తీసి శుభ్రం చేశారు. కాగా చెరువులో చేపలు చనిపోయిన విషయాన్ని అధికారులు పరిశీలన చేస్తున్నారు. సుందరంగా తయారు చేసిన ఈ చెరువులో చేపల పెంపకం చేపట్టకుండా పర్యాటకులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన మల్ల భాస్కరరావు దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,10,116లను నగదు రూపంలో పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

టీడీపీ నాయకుల సమావేశం

కొమ్మాది, మే 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సంస్థాగత నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా ఆరో వార్డులోని పీఎంపాలెంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వార్డు పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ నూతన కమిటీల ఎంపికకు ఆసక్తి గల నాయకుల పేర్లు నమోదు చేసుకున్నారు.

రోడ్డుపై మురుగు నీరు


రోడ్డుపై నిలిచిపోయిన నీరు

కొమ్మాది, మే 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని పీఎంపాలెం రామాలయం దరి రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి కాలువల్లో నెలలు తరబడి పూడికలు తీయకపోవడంతో వర్షం పడినప్పుడు మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. ఆ నీటిలో పందులు సంచరిస్తూ పరిసరాలను మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు నీరంతా రోడ్డుపైనే ఉంది. ఈ విషయమై సచివాలయం సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా.. స్పందించడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

కార్యరూపం దాల్చని ఓషన్ డెక్

... 1వ పేజీ తరువాయి

పార్కు వెనుక తీరంలో 50 మీటర్లు, సముద్రంలో మరో 50 మీటర్ల పొడవున మొత్తం 100 మీటర్ల డెక్ ఒకటి నిర్మిస్తారు. అక్కడే రెండు అంతస్థుల భవనం వస్తుంది. డెక్ నుంచి సముద్రం లోపలకు నడుచుకుంటూ వెళితే...అక్కడ 60 మంది కూర్చొనేలా రెస్టారెంట్ ఉంటుంది. రెండు అంతస్థుల భవనంలో పై అంతస్థును వ్యూపాయింట్‌గా అభివృద్ధి చేసి సందర్శకులను అక్కడకు అనుమిస్తారు. అక్కడి నుంచి సముద్రం, పరిసర ప్రాంతాలు కనువిందు చేస్తాయి. అక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొంటూ స్నాక్స్ తినే ఏర్పాట్లు కూడా ఉంటాయి. ఈప్రాజెక్టుకు రూ. 7.8 కోట్లు అవుతుందని అంచనా వ్యయంతో వేశారు. డిజైన్లు కూడా తయారుచేశారు. పూర్తయితే వీఎంఆర్‌డీఏ తరపున పర్యాటకులకు మరో ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుంది.

ప్రతిపాదనలు దాటని కాజ్‌వే నిర్మాణం

తగరపువలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస గోస్తనీ నదిపై ఉన్న శిథిల వంతెన ప్రాంతంలో కాజ్‌వే నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇక్కడ కాజ్‌వే నిర్మించడం వల్ల చిట్టివలస, తగరపువలస నుంచి చిప్పాడ, అన్నవరం, ఎరుసుపేట గ్రామాలకు నేరుగా చేరుకునే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు చెందిన వారు నది అవతల గ్రామాలకు వెళ్లాలంటే కొత్త వంతెన మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. శిథిలమైన పాత వంతెన స్థానంలో కాజ్‌వే నిర్మిస్తే ఆయా గ్రామాలకు దగ్గర దారి ఏర్పడుతుంది. ఈమేరకు గతంలో తక్కువ ఖర్చుతో కాజ్‌వే నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు, కానీ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాజ్‌వే నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కాజ్‌వే నిర్మించేందుకు ప్రతిపాదించిన స్థలం

షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం రేపు

పద్మనాభం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శేరిఖండం గ్రామంలో సోమవారం షిరిడీ సాయి ఆలయ 15వ వార్షికోత్సవం జరగనున్నట్టు సాయిసేవా ట్రస్టు ఛైర్మన్ సంగు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజున సాయినాథునికి పంచామృత, రస, విభూతి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు, అఖండ మండలారాధన నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానంతో పాటు పేదలకు వస్త్రదానం చేస్తామని చెప్పారు.

6న నేత్ర వైద్య శిబిరం

భీమునిపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 6న మెగా నేత్ర వైద్య శిబిరం జరగనుంది. బీఎస్‌డబ్ల్యూ, బ్లిస్ సహకారంతో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సన్ స్కూల్ ఆవరణలో ఈ శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.



మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన లైటింగ్, కలశాలతో మహిళల ఊరేగింపు (ఇన్‌సెట్లో) ఎర్నిమాంబ అమ్మవారు

మంగమారిపేటలో ఎర్నిమాంబ ఉత్సవాలు ప్రారంభం

భీమునిపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబ తల్లి ఉత్సవాలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఈనెల 8వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవారి ఆలయం వద్ద, రామాద్రి నుంచి మంగమారిపేట నృశింహనగర్ వరకూ రహదారిని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. శనివారం సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి, అమ్మవారికి జలాభిషేకం జరిపారు. రాత్రికి తొలేళ్ల ఉత్సవం ప్రారంభమైంది. ఆదివారం ఉదయం నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం అనుపు ఉత్సవం ఉంటుంది. ఈ సందర్భంగా పలు నేలవేషాలు, బళ్లవేషాలతో భారీ ఎత్తున బాణసంచా కాల్చనున్నారు. 7న జరిగే లంకా దహనానికి సముద్ర తీరంలో రావణాసురుడి లంకను అద్భుతంగా సెట్టింగ్‌లతో తీర్చిదిద్దుతారు. 8వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షులు గరికిన యల్లయ్య, వాసుపల్లి సూకరాజు, దూడ అచ్యుత్, వాసుపల్లి నరసింగరావు, వాసుపల్లి నల్లబాబు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

'మృతుల కుటుంబాలను ఆదుకోవాలి'

ఆనందపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం రూ. కోటి చొప్పున నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆనందపురంలో విలేకరులతో మాట్లాడారు. చందనోత్సవం తేదీని పండితులు ముందుగానే ప్రకటిస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. సంఘటన జరిగిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి జగన్ బాధిత కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారని, గోడ కూలిన ప్రదేశాన్ని వైసీపీ బృందం పరిశీలించిందన్నారు. జరిగిన సంఘటనకు మంత్రుల కమిటీ పూర్తి బాధ్యత వహించాలని చెప్పారు. ఆయనతో పాటు నాయకులు సుంకరి గిరిబాబు, కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, బంక సత్యన్నారాయణ ఉన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్), మే 3 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ రహదారిలో అవంతి కళాశాల సమీపంలో దివీస్ కంపెనీ రెండు చలి వేంద్రాలను ఏర్పాటు చేసింది. వేసవి అంతా వీటిని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ సామాజిక విభాగం మేనేజర్ డి. సురేష్ కుమార్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలి : జడ్సీ

సాగర్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీలో జోన్ -2 కమిషనర్ కనక మహాలక్ష్మి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐజీ టు బ్లాక్‌లో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. తక్షణమే వాటిని తొలగించి, ప్రధాన గెడ్డలోకి మురుగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఎంఐజీ డి బ్లాక్‌లో అధ్వానంగా ఉన్న రహదారిని పరిశీలించారు.

20న ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న కర్మాగారంలో సమ్మె చేస్తామని పేర్కొంటూ జీఎం (హెచ్‌ఆర్) మధుసూదన్‌కు నాయకులు శనివారం సమ్మె నోటీసు ఇచ్చారు. ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడ్ని తొలగించరాదని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదని, తదితర అంశాలపై సమ్మె చేస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు. జీఎంను కలిసిన వారిలో జి. శ్రీనివాసరావు, రమణ, మంత్రి రవి, కె.వంశీకృష్ణ, అప్పన్న, అప్పారావు, తదితరులు ఉన్నారు.

తిరుపతి ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు (08547)కు అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 28 వరకు, తిరుగు ప్రయాణంలో ఈనెల 8 నుంచి 29 వరకు అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులో ఉంటుందన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



పద్మనాభం, మే 3 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కంటుబోతు సన్యాసినాయుడు (60) కుమారుడు 15 ఏళ్ల క్రితం మరణించాడు. కుమారుడి మృతిని తట్టుకోలేక అప్పటి నుంచి సన్యాసినాయుడు మద్యానికి అలవాటు పడ్డాడు. కుమారుడి మీద ధ్యాసతో ఈనెల 2న సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మద్యంలో గడ్డి మందు కలుపుకొని తాగాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు అతన్ని విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య రవణ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కన్నారావు కేసు నమోదు చేశారు.

అప్పన్నకు 170 లేగ దూడలు సమర్పణ

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు మొక్కుబడిగా స్వదేశీ గోసంతతిని మాత్రమే సమర్పించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. చైత్ర, వైశాఖ, జేష్ఠ మాసాల్లో స్వామి వారికి భక్తులు గోసంతతి సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం సుమారు 170 లేగదూడలను భక్తులు సమర్పించారు. వాటి అలనాపాలనా దేవస్థానానికి పెద్ద సమస్యగా మారుతోంది. దీంతో విదేశీ గోసంతతిని కాకుండా స్వదేశీ గోసంతతిని ఇవ్వాలని కోరుతున్నారు.

మేయర్‌కు అభినందనలు

తగరపువలస, మే 3 (ఆంధ్రజ్యోతి) : మేయర్ పీలా శ్రీనివాసరావును జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి శనివారం నగరంలోని జీవీఎంసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె తగరపువలసలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పల రమేశ్, కృష్ణారావు, మాదాబత్తుల త్రినాథరావు, తెడ్లాపు చంటి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు కృష్ణాపురంలో స్థలం కేటాయింపు

పద్మనాభం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురంలో సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ పార్కు) ఏర్పాటుకు ఏపీఐఐసీకి 50 ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఈమేరకు ఇప్పటికే సేకరించిన భూములను సంస్థకు కేటాయించే ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఈమేరకు గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి అక్కడ త్వరలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఈపార్కు అభివృద్ధి చెంది పరిశ్రమల స్థాపన జరిగితే రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతో పాటు ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

కార్మికుల హక్కులపై అవగాహన

భీమునిపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని భీమిలి కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి కె. మంజుల అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకుని శనివారం భీమిలి కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలు, హక్కుల గురించి పారిశుధ్య కార్మికులు తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డి. కనకమహాలక్ష్మి, ప్రసాద్, జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ కేవీ రామశర్మ, పేనల్ లాయర్ వి. అరుణకుమారి, జి. ప్రశాంతి, బి. ఈశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాది మంజుల

సంప్రదాయబద్ధంగా పునర్వసు నక్షత్ర హవనం

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఉన్న సీతారామస్వామి సన్నిధిలో పునర్వసు నక్షత్ర హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే పునర్వసు నక్షత్రం రోజున లోక కల్యాణార్థం ప్రత్యేక హవనం జరపడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి హనుమ, లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠంపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో శాస్త్ర విధానంలో బింబారాధన, మండపారాధన పూర్తి చేసి షోడశోపచారాలు సమర్పించారు. అగ్నిప్రతిష్ఠాపన చేసి శ్రీమద్రామాయణంలోని బాలకాండ (సంక్షిప్త రామాయణం), షడక్షరీ మంత్ర జపంతో సుమారు గంటకు పైగా హవనాన్ని జరిపి మహా పూర్ణాహుతి చేశారు. అనంతరం ప్రధాన కలశంతో ఆలయ ప్రదక్షిణం చేసి మూలమూర్తి వద్ద ఉంచి పూజలు చేసిన పవిత్ర జలాలతో ప్రోక్షణ జరిపారు.


హవనం చేస్తున్న రుత్విక్‌లు

'బాధ్యులను శిక్షించాలి'

సింహాచలం,మే 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలడానికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ అర్చక పురోహిత్ ప్రముఖ్ పూడిపెద్ది శర్మ డిమాండ్ చేశారు. శనివారం హిందూ సంఘాల ప్రతినిధులు కొండదిగువ తొలిపావంచా వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటనకు కారణమైన సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజును, ఇంత జరిగినా సంప్రోక్షణ జరిపించని ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్‌ను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం మండల వీహెచ్‌పీ ప్రముఖ్ మీసాల రవీంద్ర, జగన్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాధవీలత పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు



సింహాచలం,మే 3 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు.ఆయనకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత అధికారులు శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రైల్వే కాలనీలో డీఆర్ఎం తనిఖీలు


డాల్ఫిన్ నోస్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల వసతి గృహాలను డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో పర్యటించి వసతులు, పారిశుధ్యం, విద్యుత్, నీటి సరఫరా, ఇతర సౌకర్యాల నిర్వహణను పరిశీలించారు. నివాసితులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఇళ్లల్లోకి వెళ్లి సదుపాయాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశారు. కాలనీలలో ఉండే నివాసితులకు పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, భద్రత వంటి ప్రధాన అవసరాలను సమకూర్చడంలో ఎటువంటి లోపం తలెత్తకూడదన్నారు. అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించి జీవన నాణ్యతను పెంపొందించే విధంగా సేవలందించాలని సూచించారు. ఆయనతో పాటు సీనియర్ డివిజనల్ ఇంజనీర్ జగదీష్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ అప్పారావు ఉన్నారు.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

... 1వ పేజీ తరువాయి

చేయలేదు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రూ.300 క్యూలైన్‌ను అక్కడి నుంచే పక్క మెట్ల మీదుగా మళ్లించారు. ఆ ప్రాంతంలో నిర్మించిన గోడే వర్షానికి కూలిపోయింది. కమిటీ విచారణలో ఇదే విషయం తేటతెల్లమైంది.

విధుల కేటాయింపులో వైఫల్యం

చందనోత్సవంలో సేవలు అందించానికి అటు అమలాపురం నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఉన్న ఆలయాల నుంచి వందలాది మందిని డిప్యుటేషన్‌పై సింహాచలం రప్పించారు.వారంతా చందనోత్సవానికి రెండు రోజుల ముందే ఇక్కడకు చేరుకున్నారు. అందరికీ డ్యూటీ పాయింట్లు వేశారు. అయితే అక్కడ ఎటువంటి విధులు నిర్వహించాలనే దానిపై ఎవరూ మార్గదర్శనం చేయలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆలయ ఈఓ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు...ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఆయా ఉద్యోగులకు ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాలి. గతంలో అలాగే చేసేవారు. కానీ ఈసారి సమావేశం నిర్వహించలేదు. ఏ పనులు చేయాలో ఎవరికీ చెప్పలేదు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తనకు బాధ్యతలు ఏమీ ఇవ్వలేదని కార్యాలయానికే పరిమితమయ్యారు. కమిషనర్, ఈఓలు ఇద్దరూ ఉత్సవం ముందురోజు ఎవరికీ అందుబాటులో లేరు. దాంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వందలాది మంది ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా నిల్చోవలసి వచ్చింది. ఇది కూడా ఓ వైఫల్యంగా కమిటీ దృష్టికి వచ్చింది. ఎటువంటి బాధ్యతలు అప్పగించనప్పుడు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను ఎందుకు నియమిస్తున్నట్టు? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

... 1వ పేజీ తరువాయి

కత్తి కొనుగోలుచేసి నేరుగా లక్ష్మి ఇంటికి వెళ్లాడు. బంగారం ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మెడను కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఆభరణాలను తెంచుకుని వెళ్లిపోతుండగా, మరో గదిలో ఉన్న లక్ష్మి భర్త యోగేంద్రబాబు రావడంతో ఆయన్ను కూడా హత్యచేశాడు. అనంతరం యోగేంద్రబాబుకు చెందిన స్కూటీపై వెళ్లిపోయాడు. హత్య చేసిన తర్వాత డైమండ్ పార్కు సమీపంలోని సాయిరాం డార్మెటరీకి వెళ్లి రెండు గంటలు ఉన్నాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్కూటీని పార్కింగ్‌లో వదిలేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్, అక్కడి నుంచి పూరీ వెళ్లిపోయాడు. చోరీచేసిన బంగారు ఆభరణాలను అక్కడ తన సోదరి చేతికి ఇచ్చి అమ్మి తనకు డబ్బులు తేవాలని కోరాడు. ఆమె బంగారం దుకాణానికి వెళ్లి ఆభరణాలను కరిగించి రూ.4.28 లక్షలకు విక్రయించింది. ఆ సొమ్మును తన సోదరుడైన ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఇచ్చింది. ఈ హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతురాలు లక్ష్మి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటాను తీశారు. కొన్ని నంబర్లు ఆమె డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఓ నంబర్ గల వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతనెల 21న తాను దువ్వాడ మాక్స్ షోరూమ్ వద్ద ఉండగా సుమారు 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వచ్చి కాగితంపై రాసుకున్న నంబర్‌కు తన ఫోన్ నుంచి కాల్ చేసినట్టు చెప్పారు. అక్కడవున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ప్రసన్నకుమార్ మిశ్రా ఫోన్ మాట్లాడినట్టు నమోదైంది. ఆ ఫొటోను దువ్వాడలో పలువురికి చూపించగా ప్రసన్నకుమార్‌మిశ్రాగా,అతని స్వస్థలం ఒడిశా అని నిర్ధారించడంతోపాటు వారివద్ద ఉన్న ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. ఆ ఫోన్ నంబర్ రాణిశర్మ అనే మహిళ పేరుతో ఉన్నట్టు గుర్తించారు. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో 15 మంది సీఐలు, వంద మంది సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒడిశాలో ఉన్న ప్రసన్నకుమార్ మిశ్రాను గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. మొదట తాను ఇద్దరినీ హత్య చేయలేదని చెప్పాడు. గంపల లక్ష్మికి తనతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమె భర్త యోగేంద్రబాబు హత్య చేస్తే, తాను యోగేంద్రబాబును హత్య చేసినట్టు చెప్పాడు. తర్వాత పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొత్తుకోసం లక్ష్మిని తాను హత్యచేసి వెళ్లిపోతుండగా యోగేంద్రబాబు చూడడంతో ఆయన్ను కూడా హత్యచేసినట్టు అంగీకరించాడు. నిందితుడు గతంలో యూఏఈలో ఉన్నప్పుడు చోరీకి పాల్పడి, ఐదేళ్ల జైలుశిక్ష అనుభవించాడని, విడుదలైన తర్వాత ఇండియాకు వచ్చి విశాఖలో ఉంటున్నాడని సీపీ వివరించారు. ఈ సమావేశంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, లతామాధురి, ఏసీపీలు త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

చందనోత్సవ నిర్వహణలో లోపాలు అనేకం!

... 1వ పేజీ తరువాయి

ఎటువంటి సమాచారం లేదు. సాయంత్రం ఐదు గంటల నుంచి వేయి రూపాయల టికెట్లు ఒకటి, రెండు ఇవ్వడం ప్రారంభించి రాత్రి 12 గంటల వరకూ అంటే చందనోత్సవం ఇంకో రెండు గంటల్లో ప్రారంభం అవుతుందనేంత వరకూ కొండపై ఈఓ కార్యాలయం వద్ద జారీచేస్తూనే ఉన్నారు. టికెట్లను అంతవరకూ ఇవ్వకుండా ఉండడంలో ఆంతర్యం ఏమిటో ఆలయ ఈఓ, ఇన్‌చార్జి కమిషనరే చెప్పాలి.

"నాకు ఇక్కడి సంగతులు తెలుసు... నేను చూసుకుంటా"

చందనోత్సవం టిక్కెట్లను ప్రజా ప్రతినిధులకు ఎక్కువ సంఖ్యలో ఇవ్వడం ఎప్పటి నుంచో ఉంది. తొలుత ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, ఎంపీలకు తలా కొన్ని ఇవ్వాలని సమావేశంలో ప్రతిపాదించారు. దానికి ముందు అంతా ఓకే అన్నారు. ఆ తరువాత అలా ఇవ్వలేమని దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ తేల్చిపారేశారు. ఇబ్బంది అవుతుందేమోనని జిల్లా అధికారులు అంటే...'నాకు ఇక్కడి సంగతులన్నీ తెలుసు.. నేను చూసుకుంటా...ఇక్కడే చాలాకాలం పనిచేశా. చాలా చందనోత్సవాలు చేశా' అంటూ ఆయన అన్నట్టు అధికారులు చెబుతున్నారు. కేవలం విశాఖ జిల్లా ఎమ్మెల్యేలకు మాత్రమే పరిమిత సంఖ్యలో అంటే ఏడు అంతరాలయ టికెట్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. అది కూడా రాత్రి 10 తరువాత ఎమ్మెల్యేల మనుషులు కొండపైకి వెళితే. దీనిపై ఈఓ, ఇన్‌చార్జి కమిషనర్‌తో పీఏలు మాట్లాడడానికి ప్రయత్నిస్తే వారిద్దరూ అందుబాటులో లేరు. ప్రముఖ కార్పొరేషన్ ఛైర్మన్ పీఏ రాత్రి 8.30 గంటలకు కలెక్టరేట్ నుంచి లెటర్ తీసుకొని ఈఓ కార్యాలయానికి వెళితే 10 గంటలకు టికెట్లు ఇచ్చారు. అధికారుల తీరు నచ్చక కొందరు దర్శనాలకు వెళ్లలేదు. టిక్కెట్లను అంత రాత్రి వరకూ ఎందుకు విక్రయించాల్సి వచ్చింది ? అంత ఉత్కంఠ సృష్టించాల్సిన అవసరం ఏమిటి ? అన్నది తెలియాల్సి ఉంది.

73,000

... 1వ పేజీ తరువాయి

తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇటువంటి కుటుంబాల్లో పిల్లలకు మంచి చదువు అందించడం, ఉద్యోగాల కోసం నాణ్యమైన శిక్షణ ఇప్పించడం, వారు నివసిస్తున్న ఇంటిలో చక్కని జీవనానికి వీలుగా వసతులు కల్పించడం, ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేయడం, ఇతరత్రా ప్రోత్సాహం అందజేసేందుకు మార్గదర్శకులను ఎంపికచేయాలి. దీనికి సంబంధించి ప్రభుత్వం అన్ని జిల్లాల మాదిరిగా విశాఖ జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో ప్రధానంగా నగరంలో పారిశ్రామికవేత్తలు, పెద్ద వ్యాపారులు, బిల్డర్లు, వైద్యులు, లాయర్లు, ఇతరత్రా ఉన్నత వర్గాలు, ఎన్ఐఆర్‌లను మార్గదర్శకులుగా గుర్తించే బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్నత వర్గాలు, పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బంగారు కుటుంబాలకు ఏ విధంగా ఆదుకోవాలి అనేదానిపై మార్గదర్శకులకు దిశానిర్దేశం చేయనున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు పరిధిలో గల పాత డెయిరీ ఫారం రాజీవ్‌నగర్‌కు చెందిన కావలిపురపు రామకృష్ణ (50) గత ఏడి అక్టోబరు నుంచి కనబడడం లేదంటూ అతడి భార్య రాజ్యలక్ష్మి ఆరిలోవ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. తన భర్త రైల్వే శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని, మద్యానికి బానిసై మానసిక పరిస్థితి కూడా బాగా లేదని, అందుకే మానసిక వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నట్టు రాజ్యలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలిసిన వారు, బంధువులకు ఇంటిలకు తెలియజే యగా అయన అచూకి లభ్యం కాలేదు. అయన ఫోన్‌స్విచ్ అగిపోయిందని తెలిపారు. కావున తన భార్త అచూకి తెలుసు కోవాలని అమె పోలీసులను కోరారు.

బాలుడి పొట్టలో దిగిబడిన ఇనుప చువ్వ

» సకాలంలో చికిత్స అందించడంతో తప్పిన ప్రాణాపాయం

ఆరిలోవ, మే 3 (ఆంధ్ర జ్యోతి): నగరం లోని ఆరిలోవ గాంధీనగర్‌కు చెందిన పి.పైడిరాజు కుమారుడు గోపి (17) శనివారం సాయంత్రం ఆటలు ఆడుతూ ప్రమాదవశాత్తూ మేడ పై నుంచి పడిపోవడంలో పొట్టలోకి ఇనుప ఊచ దిగబడింది. దీంతో పేగులు బయటకు వచ్చాయి. సకాలంలో కేజీహెచ్‌కు తరలించడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. వివరాలిలా ఉన్నాయి. తోటగరువు సమీపంలో శనివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఆటలు అడుతున్న సమయంలో గోపి కింద పడిపోయాడు. ఆ ప్రాంతంలో ఇనుప చువ్వ ఉండడంతో కడుపుతోకి దిగింది. ఈ హఠాత్పరిణామానికి అక్కడ వారంతా తీవ్ర భయాందోళకు గురయ్యారు. అంతలోనే కొందరు తేరుకొని ఇనుప చువ్వ నుంచి బాలుడిని విడదీసి, వెంటనే విమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వెంటనే విమ్స్ అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. అతనికి కేజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేశారని, ఆరోగ్యం నిలకడగానే ఉందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. కాగా, గోపి నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు సాధించాలి : ఆర్జేడీ ఆదినారాయణ

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనిఇంటర్మీడియట్ బోర్డు జోన్-1 ప్రాంతీయసంయుక్తసంచాలకులు (ఆర్జేడీ) మజ్జి ఆదినారాయణ అన్నారు. పిఠాపురం కాలనీలోని జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కిందటి నెల విడుదలైన వార్షిక పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలు దారుణంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల్లోనే నిష్ణాతులైన అధ్యాపకులు, మౌలిక వసతులున్నాయన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళ దుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడ దుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

ప్రజా మద్దతుతో వన్ నేషన్..వన్ ఎలక్షన్

» ఒకే ఎలక్షన్‌తో నగదు, అధికార యంత్రాంగ విధులు ఆదా
» 2019లో ఎన్నికల ఖర్చు రూ.60 వేల కోట్లు
» ప్రధాని మోదీ చరిష్మాకు భయపడే జాతీయ పార్టీలు అభ్యంతరం
» రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



చర్చా వేదికలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం...ఒకే ఎన్నికలు దేశప్రగతికి దోహదం చేస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' చర్చా వేదికలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు.దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా మూడు అంశాల్లో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) నివేదిక ప్రకారం 2019 ఎన్నికల్లో రూ.60 వేల కోట్లు ఖర్చు అయిందని తెలిపారు. ఒక ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.30 నుంచి రూ.100 కోట్లు వరకు ఖర్చు అవుతున్నట్టు సీఎంఎస్ నివేదికలు తెలుపుతున్నాయని చెప్పారు. 2014 ఎన్నికలతో పోల్చితే 2019లో మూడు రెట్లు ఎన్నికల ఖర్చు పెరిగినట్టు సీఎంఎస్ నివేదించిందన్నారు. ఏడాదికి సగటున అయిదారు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా వేల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందన్నారు. ఒకే ఎన్నిక ద్వారా నగదు ఆదా అవుతుందన్నారు. ప్రతీ ఏడాది ఎన్నికలు నిర్వహించడం ద్వారా రాష్ట్రాల అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల్లో విధుల్లో ఉండాల్సి వస్తోందన్నారు. ఒకే ఎన్నిక ద్వారా యంత్రాంగానికి ఒకే సారి విధులు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఎప్పుడు పడితే అప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందన్నారు. 40 నుంచి 60 రోజుల వరకు ఉండే ఎన్నికల కోడ్ వల్ల ఎలాంటి ఆయా రోజుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం కుదరడం లేదన్నారు. ఒకే ఎన్నికల ద్వారా ఈ మూడు అంశాల్లో దేశానికి, రాష్ట్రాలకు ఉపయోగం ఉంటుందన్నారు.

దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఉన్న చరిష్మాకి భయపడి జాతీయ పార్టీలు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'కు అభ్యంతరం తెలుపుతున్నాయని చెప్పారు. అంతకు మించి అభ్యంతరం తెలపడానికి ఆయా పార్టీల వద్ద కారణాలు లేవన్నారు. ఒకే ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ విజయాలకు నష్టం కలుగుతుందని, అందుకే ఆ పార్టీ ముందుకు రావడం లేదన్నారు.

రాష్ట్రాలను అణగదొక్కే సంస్కృతి కాంగ్రెస్‌దేనన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఆర్టికల్ 356 ఉపయోగించి ప్రభుత్వాలను పడగొట్టింది ఇందిరా గాంధీ కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు డీ లిమిటేషన్‌పై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ హితం కోసం తీసుకొని వచ్చిన వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌ను ప్రజల మద్దతుతో పార్లమెంటులో ఆమోదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి అనిల్ కె ఆంటోని, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

150 గజాలలోపు నివాసాలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, మే 3 (ఆంధ్రజ్యోతి) జీవో ఎంఎస్ నెంబరు 296, 388 చంద్రన్న పట్టాలు రిజిస్ట్రేషన్ హక్కుల కోసం అంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 30పై అవగాహన సదస్సు శనివారం సాయంత్రం తోటగరువులో గల శ్రీఎర్ని దుర్గమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ చంద్రన్న పట్టాల్లో తప్పులు సరిచేసుకోవచ్చన్నారు. అలాగే కొత్తగా పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారుడి ఇంటి వద్దకు సిబ్బంది వచ్చి సమగ్ర సర్వే చేస్తారని తెలిపారు. పలువురి సందేహాలను ఎమ్మెల్యే నివృత్తి చేశారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డివో సంగీత్ మాధుర్, తహసీల్దార్ పాల్ కిరణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 9వ వార్డు నుంచి 13వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో మహిళలు, పట్టాదారులు పాల్గొన్నారు.

చందనోత్సవంలో గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే వెలగపూడి పరామర్శ

» ప్రభుత్వం తరపున ఆదుకుంటామంటూ భరోసా


రామారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సింహగిరిపై బుధవారం క్యూ లైన్లలో గోడ కూలిన దుర్ఘటనలో ఏడు మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఆఘటనలో ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన పైలా రామారావు గాయపడిన వారిలో ఉన్నారు. ఈ క్రమంలో శనివారం బాలాజీనగర్‌లో ఉంటున్నరామారావు ఇంటికి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వెళ్లి ఆయన నుపరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చిల్డ్రన్ యోగా శిబిరం

వెంకోజీపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ యోగా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 31వ తేదీ వరకు చిల్డ్రన్ యోగా శిబిరం నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. యోగాపై మెలుకువలు, శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవడం, మానసిక ఆరోగ్యం వంటి వాటిని ఈ శిబిరంలో నేర్పించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 93980 19922/ 94944 01919/ 9985456150లో సంప్రదించాలని కోరారు.

పాకిస్తాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలి : బీజేవైఎం

సిరిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు వంశీ యాదవ్ అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు 28 మంది భారతీయులను హతమార్చిన సంఘటన యావత్ భారతదేశాన్ని విస్మయానికి గురిచేసిందన్నారు. జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎన్ఎస్ వాసు మాట్లాడుతూ దేశద్రోహులు పాకిస్థాన్‌కు పారిపోయేవిధంగా తరిమికొట్టాలన్నారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఉంటారని కానీ, ఒక్క దేశద్రోహి కనపించడని... కానీ భారతదేశంలో పాకిస్థాన్‌కు మద్దతు తెలిపే దేశద్రోహులు అడుగడుగున ఉన్నారన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు శ్రీహరికృష్ణ, సునీల్‌కుమార్, దామోదర్, సిద్ధార్థ, భార్గవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశ అవసరాల కోసం పరిశోధనలు

» సెంచూరియన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు


మాట్లాడుతున్న సెంచూరియర్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : దేశ, సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు జరపాలని సెంచూరియర్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించి పరిశోధన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు వచ్చాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు జరిపితే వారికి మంచి గుర్తింపుతో పాటు సమాజ అవసరాలు తీరుతాయన్నారు. కాలం చెల్లిన అంశాలపై పరిశోధనలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పలువురు పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం..

» దాకమర్రి లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు
» హతురాలు మారికవలస రాజీవ్ గృహకల్పకు చెందిన వివాహిత


హత్యకు గురైన వెంకటలక్ష్మి (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం/ భీమునిపట్నం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలకలం రేపిన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధి దాకమర్రి శివారులోని ఫార్చ్యూన్ హిల్స్ వుడా లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న వ్యక్తే ఆమెను హత్య చేసినట్టు నిర్ధారించారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 38 ఏళ్ల మహిళ (వెంకటలక్ష్మి) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి మారికవలసలోని రాజీవ్ గృహకల్ప బ్లాక్ నంబర్-121లో ఎస్ఎఫ్-4లో నివాసం ఉంటుంది. ఒడిశాలోని రాయగడ జిల్లా కాంపోమల్లిగాంకు చెందిన శరాతి కాంతికుమార్ (25)కు మొదటిభార్య ఉండగానే రెండో వివాహం చేసుకున్నాడు. తొలి భార్య, పిల్లలు తగరపువలసలో ఉంటుండగా, రెండో భార్యను నాలుగేళ్ల కిందట రాజీవ్ గృహకల్పలో మృతురాలు ఉంటున్న ఇంటి పక్కనే ఉంచాడు. ఈ క్రమంలో మృతురాలికి కాంతికుమార్‌కు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై రెండో భార్య గొడవ పడడంతో ఆమెను అదే కాలనీలోని మరో బ్లాక్‌కు మార్చాడు. ఇటీవల కాలంలో మృతురాలు తనతో ఎక్కువ సమయం గడపాలని ఒత్తిడి చేస్తోంది. అప్పటికే ఇద్దరు భార్యలతో గొడవలు జరుగుతుండడంతో మృతురాలిని ఎలాగైనా వదిలించుకోవాలని కాంతికుమార్ భావించాడు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీ రాత్రి 8 గంటల సమయంలో మృతురాలు వెంకటలక్ష్మికి ఫోన్ చేసి సిటీలోకి వెళదామని చెప్పాడు. దీంతో ఆమె ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లింది. కాంతికుమార్ ముందుగానే చాకుని తీసుకుని బైక్‌పై వెళ్లి మృతురాలిని ఎక్కించుకున్నాడు. తీరంలోని తెన్నేటి పార్కు వద్ద కాసేపు ఐస్‌క్రీమ్ తిన్నాక బైకులో పెట్రోల్ అయిపోయిందని బెంక్‌కు వెళ్లారు. కొంత పెట్రోల్‌ను బైక్‌లో వేయించి, మరికొంత తనతో తెచ్చుకున్న బాటిల్‌లో వేయించాడు. బాటిల్‌లో పెట్రోల్ ఎందుకని మృతురాలు ప్రశ్నించగా, తన ఇంటి వద్ద బైక్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్నారని, దీంతో ఉదయాన్నే డ్యూటీకి వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని చెప్పడంతో మృతురాలికి అనుమానం రాలేదు. అక్కడ నుంచి తిమ్మాపురం సమీపంలోని రామాద్రి బీచ్‌వద్దకు వెళ్లి నూడిల్స్ తిన్నారు. అనంతరం దాకమర్రి రఘు కాలేజీ రోడ్డులో టీ టైమ్ దగ్గర ఆగి ఇద్దరూ కాఫీ తాగారు. ఆ తరువాత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శారీరకంగా కలుద్దామని నమ్మించి ఆమెను ఫార్చ్యూన్‌లేఅవుట్‌లోకి తీసుకువెళ్లాడు. అక్కడకు వెళ్లాక చీకట్లో చాకుతో మృతురాలి మెడను కోసి హత్య చేశాడు. ఆ తరువాత ఆమె మెడలోని ఆభరణాలు, చెవిదిద్దులను తీసుకుని బాటిల్‌తో తెచ్చిన పెట్రోల్‌ను పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. ఆ మర్నాడు సగం కాలిన మహిళ మృతదేహం ఉన్నట్టు సమాచారం అందగానే సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నార్త్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో భీమిలి సీఐ తిరుమలరావు, ఆనందపురం సీఐ వాసునాయుడు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను విచారణ కోసం ఏర్పాటు చేశారు. ఘటనా స్థలిలో లభ్యమైన దుస్తులు, ఇతర వస్తువులు, ఆనవాళ్లను పోలీసులు సోషల్ మీడియా ద్వారా విడుదల చేయడంతో మృతురాలి ఆచూకీ లభ్యమైంది. మృతురాలి ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడైన కాంతికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ వెల్లడించారు. హత్యకు సంబంధించిన సమాచారం అందిన ఆరు గంటల వ్యవధిలోనే మృతురాలితో పాటు నిందితుడిని గుర్తించడం, నిందితున్ని అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

హౌసింగ్‌లో రిటైర్డు అధికారికి రీ పోస్టింగ్

» జిల్లా అధికారుల ప్రమేయం లేకుండానే..

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏపీ గృహని ర్మాణ సంస్థలో అధికారుల కొరతను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సుమారు రెండున్నరేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీఆర్‌వీ ప్రసాదరావుకు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ఏడాది కాలానికి ఒప్పందం మేరకు పోస్టింగ్ ఇస్తూ గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయజైన్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులను సమర్థంగా అమలు చేసే అనుభవం ఉన్నందున ప్రసాదరావుకు తిరిగి పోస్టింగ్ ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ప్రసాదరావును తిరిగి నియమించాలన్న దానిపై జిల్లా యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు పంపకపోయినా హౌసింగ్ ప్రధాన కార్యాలయం ఆమోదం తెలపడం గమనార్హం. టీడీపీలో కీలక నేత ప్రాపకంతో ప్రసాదరావుకు తిరిగి డీఈఈగా నియమించారనే వాదన వినిపిస్తోంది. ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే తూర్పు నియోజకవర్గ పరిధిలో ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రసాదరావుకు కేటాయిస్తూ హౌసింగ్ ఎండీ ప్రొసీడింగ్స్ ఇవ్వడం పట్ల జిల్లా కార్యాలయంలో ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'తూర్పు'లో విధుల నిర్వహణకు ఆదేశాలు తెచ్చుకున్న విషయం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కనీస సమాచారం లేదు. కాగా హౌసింగ్ కార్యాలయంలో అధికారుల కొరత ఉన్నమాట వాస్తవమే అయినా గతంలో డీఈఈగా ప్రసాదరావు చేపట్టిన పలు ప్రాజెక్టుల అమలుపై అనేక ఆరోపణలున్నాయని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంభన లభిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 9వ వార్డులోని పెదగదిలి కమ్యూనిటీ హాలులో శనివారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టైలరింగ్‌లో నైపుణ్యం సంపాదించి, ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్ల సహాయంతో ఆదాయ వనరులు లభిస్తాయన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. 80 శాతం హాజరు ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుదుమూరి గోవింద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, వార్డు కార్యదర్శి వెంకటరావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఒమ్మి పోలారావు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

ఆరిలోవ మే 3 (ఆంధ్ర జ్యోతి) : తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18 వరకూ జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహా సభలు జయప్రదం చేయాలని సమాఖ్య సహాయ కార్యదర్శి కె.సందీప్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆరిలోవలోని భగత్‌సింగ్ నగర్‌లో శనివార ఆయన ఆవిష్కరించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



అధికారికి చెక్కు అందజేస్తున్న దాతలు

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి విశాఖకు చెందిన చలసాని మాలిని కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. శనివారం ఆలయంలో అధికారులకు చెక్కు రూపంలో విరాళం మొత్తాన్ని అందజేశారు. ఇలా ఉండగా అమ్మవారి ఆలయంలో తులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

20న ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేసి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కర్మాగారంలో సమ్మె చేస్తామని సంఘ నాయకులు శనివారం జీఎం (హెచ్‌ఆర్) ఎం.మధుసూదన్‌కు నోటీసు ఇచ్చారు. ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు. జీఎంను కలిసిన వారిలో అఖిలపక్ష నాయకులు జి.శ్రీనివాసరావు, రమణ, మంత్రి రవి, కె.వంశీకృష్ణ, అప్పన్న, అప్పారావు ఉన్నారు.

బైక్ దగ్ధం



కాలిపోతున్న బైక్

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలో ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని పార్కు చేసి ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లాడు. ఆ వాహనం నుంచి నెమ్మదిగా పొగలు వస్తూ అందరూ చూస్తుండగానే క్షణాల్లో ఒక్కసారిగా వాహనానికి మంటలు అంటుకున్నాయి. సమీపం నుంచే చూస్తున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి విషయాన్ని తెలియజేయడంతో వారు వెంటనే వచ్చారు. కానీ అప్పటికే వాహనం చాలావరకు కాలిపోయింది.

రెండు కళాశాలల్లో నేడు నీట్

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆదివారం నీట్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష ఇన్విజిలేటర్లకు శనివారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని సీనియర్ అధ్యాపకుడు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.డి.దామోదర్ నిర్వహించారు. ఇన్విజిలేటర్ల చేపట్టాల్సిన విధులను కూలంకషంగా వివరించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట 29వ వార్డు కన్నయ్యపేటలో జనసేన గుర్తింపు కార్డులను శనివారం ఆ పార్టీ నాయకుడు మన్నాల శ్రీనివాస్ పంపిణీ చేశారు. కొత్తగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. క్రియాశీల సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రమాద బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసారా నవ్వేద్దాం..

» నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



ఎంవీ సుబ్రహ్మణ్యం

డాబాగార్డెన్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి, చికాకు, కోపం.. ఇలాంటి వాటిని దూరం చేసేందుకు మంచి మందు నవ్వు. మనసారా నవ్వుకుంటే అనేక రోగాలు మటుమాయమవుతాయన్నది పెద్దల సూచన. నవ్వులో ఉండే మజాను గ్రహించిన నగరవాసి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం 'ఫ్రెండ్స్ కామెడీ క్లబ్'ను నెలకొల్పి ప్రదర్శనల ద్వారా చాలామందిని నవ్విస్తున్నారు. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

తనతో పాటు పదిమందీ హాయిగా నవ్వుకునేలా ఏదైనా చేయాలని సంకల్పించిన సుబ్రహ్మణ్యం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ పేరుతో ఓ సంస్థను నెలకొల్పి దశాబ్దకాలంగా వివిధ రకాల ప్రదర్శనలు ఇస్తూ నవ్వులు పూయిస్తున్నారు. కళాకారులు, హాస్యప్రియులను సమన్వయపరిచి ప్రతీ నెల క్రమం తప్పకుండా మొదటి ఆదివారం విశాఖలోని పౌర గ్రంథాలయం, ఏయూ, అల్లూరి విజ్ఞాన కేంద్రం తదితర వేదికలపై మూడు గంటల పాటు హాస్య నాటిక ప్రదర్శనలు ఇస్తుంటారు. 'నవ్వుల హరివిల్లు' పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్లబ్ ద్వారా హాస్యనాటికలు, చిన్న చిన్న స్కిట్స్ ప్రదర్శిస్తున్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, విశాఖ హ్యూమర్ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, హైదరాబాద్ లాఫింగ్ క్లబ్, లాఫ్టర్స్ క్లబ్ తదితర పదకొండు క్లబ్స్ ప్రజలను నవ్విచేందుకు ప్రయత్నిస్తుంటాయి. అయితే ఎక్కువ శాతంలోని ఫ్రెండ్స్ కామెడీ, హ్యూమర్, హాస్యప్రియ తదితర క్లబ్‌లు నెల నెలా ప్రదర్శనలు ఇస్తుంటాయి. మరికొందరు కొన్ని కొన్ని సమయాల్లో మాత్రమే ప్రదర్శనలు ఇస్తుంటారు. ఔత్సాహిక కళాకారులను వెలికితీయడం, ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యమని అంటారు సుబ్రహ్మణ్యం. ప్రదర్శనలకు అయ్యే ఖర్చును సొంతంగా భరిస్తున్నట్లు చెప్పారు.



సుడిగుండాలలో అమ్ముతావా...ప్రదర్శన (ఫైల్)

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవంలో భాగంగా శనివారం స్థానిక బీఎస్‌ఆర్ భవనంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా రక్తదానం శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్మిక సంక్షేమ కమిషనర్ ధూళిపాళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే రక్తదానం చేయడం విధిగా మనమంతా గుర్తించాలన్నారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్తదానంతో పాటు అవయవదానం, దేహ దానాన్ని ప్రోత్రహించాలన్నారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు చేపడుతున్న డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నావల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులకు అదనంగా థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలుకు (08547) ఈ నెల 7 నుంచి 28 వరకు, తిరుగు ప్రయాణంలో తిరుపతి-విశాఖ రైలుకు (08548) ఈ నెల 8 నుంచి 29 వరకు అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో రచయిత జ్యోతిర్మయి మళ్ళ రాసిన 'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విచ్చేసి గజల్ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం గజల్లు రాస్తూ, స్వరకల్పన చేసి పాడుతూ అందరికీ గజల్ రచనలో శిక్షణ ఇస్తూ చేస్తున్న కృషితో జ్యోతిర్మయి గజల్ చరిత్రలో ముఖ్యమైన భాగంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. గజల్ ప్రయాణం నిర్విరామంగా కొనసాగాలని అతిథులు ఆశీర్వదించారు. ప్రముఖ గజల్ కవి, సాహితీ విశ్లేషకులు బిక్కి కృష్ణ ఈ పుస్తకంపై సమీక్షను అందించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వి.వి.రమణమూర్తి, గౌరవ అతిథిగా డాక్టర్ బిక్కి కృష్ణ, ఆత్మీయ అతిథులుగా గంటి మురళి, ఎం.ఆదినారాయణ, శేఖరమంత్రి ప్రభాకరరావు, పి.కె.జయలక్ష్మి, బోర భారతిదేవి, జ్యోట్ల గౌరవ అధ్యక్షులు చల్లా రాంబాబు, కోశాధికారి మళ్ళ ప్రభాకరరావు, మాధవి, కె.రంగారావు, హేమలత, అనిత పాల్గొన్నారు.

గిరిజనులను మభ్యపెడుతున్న వైసీపీ: కిడారి

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 3 విషయంలో వైసీపీ నాయకులు గిరిజనులను మభ్యపెడుతున్నారని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం విశాఖలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఆ జీవో రద్దయ్యిందని, దీనిపై మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. అసెంబ్లీకి వెళ్లి ఈ విషయమై వారు ఎందుకు మాట్లాడటం లేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేసి పోరాటం చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో డీఎస్సీ ఎందుకు నిర్వహించలేకపోయారని ప్రశ్నించారు.

గెడ్డ మరమ్మతులకు శంకుస్థాపన

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి పైడిమాంబ కాలనీలో ప్రధాన గెడ్డ మరమ్మతులకు కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.19.8 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు మళ్ల శంకరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీ వాసులకు ఇళ్లు నిర్మిస్తాం: వంశీకృష్ణ



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ, ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న 56 మందికి పక్కా ఇళ్లు నిర్మించనున్నట్లు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన ఇందిరానగర్ కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో సమస్యలను తనకు చెబితే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు వేరే చోట నివాసానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించగా వారంతా అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, గొలగాని వీరారావు బుజ్జి, జడ్సీ రాము, నాయకులు అకిరెడ్డి జగదీష్, ఆళ్ల శ్రీనివాస్, కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, దువ్వి కాళీ ప్రసాద్, ఎంఎల్ఎన్ రావు, శ్రీకృష్ణ, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో జనవాణి

సీతంపేట, మే 3, (ఆంధ్రజ్యోతి): నగర జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనవాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు తెలపడానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వారి సమస్యలు తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో ప్రముఖులు

అక్కయ్యపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏడో జాతీయ చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ క్రీడాకారులను శనివారం బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురాం, ఇతర ప్రముఖులు అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఏపీ నుంచి అన్ని కేటగిరీలలో 50 మంది బాక్సర్లు పాల్గొన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా బి.వాసు, మేనేజర్‌గా విజయ భాస్కర్ రెడ్డి (కడప), రిఫరీగా బి.కనకరాజు, ఇతర కోచ్‌లుగా ఏపీ బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురాం, సెక్రటరీగా వి.అమ్మోరు వ్యవహరించారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీల్లో పాల్గొన్న బాక్సింగ్ క్రీడాకారులకు 34 బంగారు, 14 వెండి పతకాలు లభించాయి. చాంపియన్ షిప్ సాధించిన వారికి నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, డాక్టర్ గొట్ల కృష్ణారెడ్డి, అడ్వయిజర్ సాయి సతీష్, పి.గణేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఆర్‌వోసీ రుబిన్‌లు సత్కరించి అభినందించారు.

రైల్వేకాలనీలో డీఆర్ఎం తనిఖీలు



డాల్ఫిన్ నోస్ రైల్వేకాలనీలో మురుగు కాలువను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల వసతి గృహాలను డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో పర్యటించి వసతులు, పారిశుధ్యం, విద్యుత్, నీటి సరఫరా, ఇతర సౌకర్యాల నిర్వహణను పరిశీలించారు. నివాసితులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఇళ్లల్లోకి వెళ్లి సదుపాయాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశారు. కాలనీలలో ఉండే నివాసితులకు పారిశుద్యం, విద్యుత్ దీపాలు, భద్రత వంటి ప్రధాన అవసరాలను సమకూర్చడంలో ఎటువంటి లోపం తలెత్తకూడదని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించి జీవన నాణ్యతను పెంపొందించే విధంగా సేవలందించాలని సూచించారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ జగదీష్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ అప్పారావు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లతో రోడ్డుపై వీరంగం

» దయానందనగర్‌లో ఘటన » సీపీ ఆదేశించేవరకు కదలని కంచరపాలెం పోలీసులు

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గొడవలు సర్వసాధారణమైనా పోలీసులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఇటీవల బర్మాక్యాంప్‌లో జరిగిన దాడిని మరువకముందే, ఐదురోజుల క్రితం 56వ వార్డు పరిధి చాకలి గెడ్డ దయానందనగర్ ప్రాంతంలో ఇద్దరు యువకులు మద్యం తాగి కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లతో నడిరోడ్డు మీదే వీరంగం సృష్టించడంతో స్థానికులు భయాందోనకు గురయ్యారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక చాకలి గెడ్డ దయానంద నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎం.కనకరాజు, శ్రీనివాసరావులపై వారి ఇంటి పక్కన ఉంటున్న శివకుమార్, స్వామి, సంధ్యారాణి కలిసి గత నెల 27న రాత్రి 9.30 గంటల సమయంలో దాడికి పాల్పడ్డారు. శివకుమార్ కనకరాజుపై కత్తితో దాడికి ప్రయత్నించగా స్వామి కర్ర, ఇనుపరాడ్డుతో వారి ఇంటి మీదకి వెళ్లాడు. దీంతో కనకరాజు, శ్రీనివాసరావులు భయంతో పరుగులు తీశారు. ఈ దాడికి పాల్పడిన శివకుమార్, స్వామి మద్యం తాగి రోజూ ఇలానే చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. బాధితులు కనకరాజు, శ్రీనివాసరావులు కంచరపాలెం పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో శుక్రవారం బాధితులు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించారు. ఆయన ఆదేశించడంతో కంచరపాలెం పోలీసుల్లో కదలిక వచ్చి నిందితులపై శనివారం కేసు నమోదు చేశారు.

73,000

... 1వ పేజీ తరువాయి

తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇటువంటి కుటుంబాల్లో పిల్లలకు మంచి చదువు అందించడం, ఉద్యోగాల కోసం నాణ్యమైన శిక్షణ ఇప్పించడం, వారు నివసిస్తున్న ఇంటిలో చక్కని జీవనానికి వీలుగా వసతులు కల్పించడం, ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేయడం, ఇతరత్రా ప్రోత్సాహం అందజేసేందుకు మార్గదర్శకులను ఎంపికచేయాలి. దీనికి సంబంధించి ప్రభుత్వం అన్ని జిల్లాల మాదిరిగా విశాఖ జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో ప్రధానంగా నగరంలో పారిశ్రామికవేత్తలు, పెద్ద వ్యాపారులు, బిల్డర్లు, వైద్యులు, లాయర్లు, ఇతరత్రా ఉన్నత వర్గాలు, ఎన్ఐఆర్‌లను మార్గదర్శకులుగా గుర్తించే బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్నత వర్గాలు, పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బంగారు కుటుంబాలకు ఏ విధంగా ఆదుకోవాలి అనేదానిపై మార్గదర్శకులకు దిశానిర్దేశం చేయనున్నారు.

కార్యరూపం దాల్చని ఓషన్ డెక్

... 1వ పేజీ తరువాయి

పార్కు వెనుక తీరంలో 50 మీటర్లు, సముద్రంలో మరో 50 మీటర్ల పొడవున మొత్తం 100 మీటర్ల డెక్ ఒకటి నిర్మిస్తారు. అక్కడే రెండు అంతస్థుల భవనం వస్తుంది. డెక్ నుంచి సముద్రం లోపలకు నడుచుకుంటూ వెళితే...అక్కడ 60 మంది కూర్చొనేలా రెస్టారెంట్ ఉంటుంది. రెండు అంతస్థుల భవనంలో పై అంతస్థను వ్యూ పాయింట్‌గా అభివృద్ధి చేసి సందర్శకులను అక్కడకు అనుమిస్తారు. అక్కడి నుంచి సముద్రం, పరిసర ప్రాంతాలు కనువిందు చేస్తాయి. అక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొంటూ స్నాక్స్ తినే ఏర్పాట్లు కూడా ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు రూ.7.8 కోట్లు అవుతుందని అంచనా వ్యయంతో వేశారు. డిజైన్లు కూడా తయారుచేశారు. పూర్తయితే వీఎంఆర్‌డీఏ తరపున పర్యాటకులకు మరో మంచి ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుంది.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

... 1వ పేజీ తరువాయి

చేయలేదు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రూ.300 క్యూలైన్‌ను అక్కడి నుంచే పక్కమెట్ల మీదుగా మళ్లించారు. ఆ ప్రాంతంలో నిర్మించిన గోడే వర్షానికి కూలిపోయింది. కమిటీ విచారణలో ఇదే విషయం తేటతెల్లమైంది.

విధుల కేటాయింపులో వైఫల్యం

చందనోత్సవంలో సేవలు అందించానికి అటు అమలాపురం నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఉన్న ఆలయాల నుంచి వందలాది మందిని డిప్యుటేషన్‌పై సింహాచలం రప్పించారు. వారంతా చందనోత్సవానికి రెండు రోజుల ముందే ఇక్కడకు చేరుకున్నారు. అందరికీ డ్యూటీ పాయింట్లు వేశారు. అయితే అక్కడ ఎటువంటి విధులు నిర్వహించాలనే దానిపై ఎవరూ మార్గదర్శనం చేయలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆలయ ఈఓ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు...ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఆయా ఉద్యోగులకు ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాలి. గతంలో అలాగే చేసేవారు. కానీ ఈసారి సమావేశం నిర్వహించలేదు. ఏ పనులు చేయాలో ఎవరికీ చెప్పలేదు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తనకు బాధ్యతలు ఏమీ ఇవ్వలేదని కార్యాలయానికే పరిమితమయ్యారు. కమిషనర్, ఈఓలు ఉత్సవం ముందురోజు ఎవరికీ అందుబాటులో లేరు. దాంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వందలాది మంది ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా నిల్చోవలసి వచ్చింది. ఇది కూడా కమిటీ దృష్టికి వచ్చింది. ఎటువంటి బాధ్యతలు అప్పగించనప్పుడు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను ఎందుకు నియమిస్తున్నట్టు? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

చందనోత్సవ నిర్వహణలో లోపాలు అనేకం!

... 1వ పేజీ తరువాయి

ఎటువంటి సమాచారం లేదు. సాయంత్రం ఐదు గంటల నుంచి వేయి రూపాయల టికెట్లు ఒకటి, రెండు ఇవ్వడం ప్రారంభించి రాత్రి 12 గంటల వరకూ అంటే చందనోత్సవం ఇంకో రెండు గంటల్లో ప్రారంభం అవుతుందనేంత వరకూ కొండపై ఈఓ కార్యాలయం వద్ద జారీచేస్తూనే ఉన్నారు. టికెట్లను అంతవరకూ ఇవ్వకుండా ఉండడంలో ఆంతర్యం ఏమిటో ఆలయ ఈఓ, ఇన్‌చార్జి కమిషనరే చెప్పాలి.

"నాకు ఇక్కడి సంగతులు తెలుసు... నేను చూసుకుంటా"

చందనోత్సవం టిక్కెట్లను ప్రజా ప్రతినిధులకు ఎక్కువ సంఖ్యలో ఇవ్వడం ఎప్పటి నుంచో ఉంది. తొలుత ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, ఎంపీలకు తలా కొన్ని ఇవ్వాలని సమావేశంలో ప్రతిపాదించారు. దానికి ముందు అంతా ఓకే అన్నారు. ఆ తరువాత అలా ఇవ్వలేమని దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ తేల్చిపారేశారు. ఇబ్బంది అవుతుందేమోనని జిల్లా అధికారులు అంటే..'నాకు ఇక్కడి సంగతులన్నీ తెలుసు..నేను చూసుకుంటా...ఇక్కడే చాలాకాలం పనిచేశా. చాలా చందనోత్సవాలు చేశా' అంటూ ఆయన అన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ తరువాత కేవలం విశాఖ జిల్లా ఎమ్మెల్యేలకు మాత్రమే పరిమిత సంఖ్యలో అంటే ఏడు అంతరాలయ టికెట్లు ఇస్తామని ఆయన స్పష్టంచేశారు. అది కూడా రాత్రి 10 గంటల తరువాత ఆయా ఎమ్మెల్యేల మనుషులు కొండపైకి వెళితే. దీనిపై ఈఓ, ఇన్‌చార్జి కమిషనర్‌తో పీఏలు మాట్లాడడానికి ప్రయత్నిస్తే వారిద్దరూ అందుబాటులో లేరు. నగరంలో ప్రముఖ కార్పొరేషన్ చైర్మన్ పీఏ రాత్రి 8.30 గంటలకు కలెక్టరేట్ నుంచి లెటర్ తీసుకొని ఈఓ కార్యాలయానికి వెళితే 10 గంటలకు టికెట్లు ఇచ్చారు. అధికారుల తీరు నచ్చక కొందరు దర్శనాలకు వెళ్లలేదు. దర్శనం టిక్కెట్లను అంత రాత్రి వరకూ ఎందుకు విక్రయించాల్సి వచ్చింది? అంత ఉత్కంఠ సృష్టించాల్సిన అవసరం ఏమిటి? అనేది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

... 1వ పేజీ తరువాయి

కత్తి కొనుగోలుచేసి నేరుగా లక్ష్మి ఇంటికి వెళ్లాడు. బంగారం ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మెడను కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఆభరణాలను తెంచుకుని వెళ్లిపోతుండగా, మరో గదిలో ఉన్న లక్ష్మి భర్త యోగేంద్రబాబు రావడంతో ఆయన్ను కూడా హత్యచేశాడు. అనంతరం యోగేంద్రబాబుకు చెందిన స్కూటీపై వెళ్లిపోయాడు. హత్య చేసిన తర్వాత డైమండ్ పార్కు సమీపంలోని సాయిరాం డార్మెటరీకి వెళ్లి రెండు గంటలు ఉన్నాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్కూటీని పార్కింగ్‌లో వదిలేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్, అక్కడి నుంచి పూరీ వెళ్లిపోయాడు. చోరీచేసిన బంగారు ఆభరణాలను అక్కడ తన సోదరి చేతికి ఇచ్చి అమ్మి తనకు డబ్బులు తేవాలని కోరాడు. ఆమె బంగారం దుకాణానికి వెళ్లి ఆభరణాలను కరిగించి రూ.4.28 లక్షలకు విక్రయించింది. ఆ సొమ్మును తన సోదరుడైన ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఇచ్చింది. ఈ హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతురాలు లక్ష్మి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటాను తీశారు. కొన్ని నంబర్లు ఆమె డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఓ నంబర్ గల వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతనెల 21న తాను దువ్వాడ మార్క్స్ షోరూమ్ వద్ద ఉండగా సుమారు 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వచ్చి కాగితంపై రాసుకున్న నంబర్‌కు తన ఫోన్ నుంచి కాల్ చేసినట్టు చెప్పారు. అక్కడవున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ప్రసన్నకుమార్‌మిశ్రా ఫోన్ మాట్లాడినట్టు నమోదైంది. ఆ ఫొటోను దువ్వాడ ప్రాంతంలో పలువురికి చూపించగా ప్రసన్నకుమార్‌మిశ్రాగా, అతనిస్వస్థలం ఒడిశా అని నిర్ధారించడంతోపాటు వారివద్ద ఉన్న ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. ఆ ఫోన్ నంబర్ రాణిశర్మ అనే మహిళ పేరుతో ఉన్నట్టు గుర్తించారు. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో 15 మంది సీఐలు, వంద మంది సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒడిశాలో ఉన్న ప్రసన్నకుమార్‌మిశ్రాను అదుపులోకి తీసుకున్నాయి. మొదట తాను ఇద్దరినీ హత్య చేయలేదని చెప్పాడు. గంపల లక్ష్మికి తనతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమెను భర్త యోగేంద్రబాబు హత్య చేస్తే, తాను అతడ్ని హతమార్చినట్టు చెప్పాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొత్తుకోసం లక్ష్మిని తాను హత్యచేసి వెళ్లిపోతుండగా యోగేంద్రబాబు చూడడంతో ఆయన్ను కూడా హత్యచేసినట్టు అంగీకరించాడు. నిందితుడు గతంలో యూఏఈలో ఉన్నప్పుడు చోరీకి పాల్పడి, ఐదేళ్ల జైలుశిక్ష అనుభవించాడని, విడుదలైన తర్వాత ఇండియాకు వచ్చి విశాఖలో నివాసం ఉంటున్నాడని సీపీ వివరించారు. డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, లతామాధురి, ఏసీపీలు త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు పరిధిలో గల పాత డెయిరీ ఫారం రాజీవ్‌నగర్‌కు చెందిన కావలిపురపు రామకృష్ణ (50) గత ఏది అక్టోబరు నుంచి కనబడడం లేదంటూ అతడి భార్య రాజ్యలక్ష్మి ఆరిలోవ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. తన భర్త రైల్వే శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని, మద్యానికి బానిసై మానసిక పరిస్థితి కూడా బాగా లేదని, అందుకే మానసిక వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నట్టు రాజ్యలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలిసిన వారు, బంధువులకు ఇంటిలకు తెలియజేయగా అయన అచూకి లభ్యం కాలేదు. అయన ఫోన్‌స్విచ్ అగిపోయిందని తెలిపారు. కావున తన భార్త అచూకి తెలుసు కోవాలని అమె పోలీసులను కోరారు.

బాలుడి పొట్టలో దిగిబడిన ఇనుప చువ్వ

» సకాలంలో చికిత్స అందించడంతో తప్పిన ప్రాణాపాయం

ఆరిలోవ, మే 3 (ఆంధ్ర జ్యోతి): నగరం లోని ఆరిలోవ గాంధీనగర్‌కు చెందిన పి.పైడిరాజు కుమారుడు గోపి (17) శనివారం సాయంత్రం ఆటలు ఆడుతూ ప్రమాదవశాత్తూ మేడ పై నుంచి పడిపోవడంలో పొట్టలోకి ఇనుప ఊచ దిగబడింది. దీంతో పేగులు బయటకు వచ్చాయి. సకాలంలో కేజీహెచ్‌కు తరలించడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. వివరాలిలా ఉన్నాయి. తోటగరువు సమీపంలో శనివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఆటలు అడుతున్న సమయంలో గోపి కింద పడిపోయాడు. ఆ ప్రాంతంలో ఇనుప చువ్వ ఉండడంతో కడుపుతోకి దిగింది. ఈ హఠాత్పరిణామానికి అక్కడ వారంతా తీవ్ర భయాందోళకు గురయ్యారు. అంతలోనే కొందరు తేరుకొని ఇనుప చువ్వ నుంచి బాలుడిని విడదీసి, వెంటనే విమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వెంటనే విమ్స్ అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. అతనికి కేజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేశారని, ఆరోగ్యం నిలకడగానే ఉందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. కాగా, గోపి నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

సప్లిమెంటరీలో మెరుగైన ఫలితాలు సాధించాలి : ఆర్జేడీ ఆదినారాయణ

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనిఇంటర్మీడియట్ బోర్డు జోన్-1 ప్రాంతీయసంయుక్తసంచాలకులు (ఆర్జేడీ) మజ్జి ఆదినారాయణ అన్నారు. పిఠాపురం కాలనీలోని జిల్లా ఇంటర్ బోర్డు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కిందటి నెల విడుదలైన వార్షిక పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలు దారుణంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల్లోనే నిష్ణాతులైన అధ్యాపకులు, మౌలిక వసతులున్నాయన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళ దుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడ దుంపలు 34, కంద 80, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

ప్రజా మద్దతుతో వన్ నేషన్..వన్ ఎలక్షన్

» ఒకే ఎలక్షన్‌తో నగదు, అధికార యంత్రాంగ విధులు ఆదా
» 2019లో ఎన్నికల ఖర్చు రూ.60 వేల కోట్లు
» ప్రధాని మోదీ చరిష్మాకు భయపడే జాతీయ పార్టీలు అభ్యంతరం
» రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



చర్చా వేదికలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం...ఒకే ఎన్నికలు దేశప్రగతికి దోహదం చేస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' చర్చా వేదికలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు.దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా మూడు అంశాల్లో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) నివేదిక ప్రకారం 2019 ఎన్నికల్లో రూ.60 వేల కోట్లు ఖర్చు అయిందని తెలిపారు. ఒక ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.30 నుంచి రూ.100 కోట్లు వరకు ఖర్చు అవుతున్నట్టు సీఎంఎస్ నివేదికలు తెలుపుతున్నాయని చెప్పారు. 2014 ఎన్నికలతో పోల్చితే 2019లో మూడు రెట్లు ఎన్నికల ఖర్చు పెరిగినట్టు సీఎంఎస్ నివేదించిందన్నారు. ఏడాదికి సగటున అయిదారు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా వేల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందన్నారు. ఒకే ఎన్నిక ద్వారా నగదు ఆదా అవుతుందన్నారు. ప్రతీ ఏడాది ఎన్నికలు నిర్వహించడం ద్వారా రాష్ట్రాల అధికార యంత్రాంగం మొత్తం ఎన్నికల్లో విధుల్లో ఉండాల్సి వస్తోందన్నారు. ఒకే ఎన్నిక ద్వారా యంత్రాంగానికి ఒకే సారి విధులు ఉంటాయన్నారు. ముఖ్యంగా ఎప్పుడు పడితే అప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందన్నారు. 40 నుంచి 60 రోజుల వరకు ఉండే ఎన్నికల కోడ్ వల్ల ఎలాంటి ఆయా రోజుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం కుదరడం లేదన్నారు. ఒకే ఎన్నికల ద్వారా ఈ మూడు అంశాల్లో దేశానికి, రాష్ట్రాలకు ఉపయోగం ఉంటుందన్నారు.

దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఉన్న చరిష్మాకి భయపడి జాతీయ పార్టీలు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్'కు అభ్యంతరం తెలుపుతున్నాయని చెప్పారు. అంతకు మించి అభ్యంతరం తెలపడానికి ఆయా పార్టీల వద్ద కారణాలు లేవన్నారు. ఒకే ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ విజయాలకు నష్టం కలుగుతుందని, అందుకే ఆ పార్టీ ముందుకు రావడం లేదన్నారు.

రాష్ట్రాలను అణగదొక్కే సంస్కృతి కాంగ్రెస్‌దేనన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఆర్టికల్ 356 ఉపయోగించి ప్రభుత్వాలను పడగొట్టింది ఇందిరా గాంధీ కాదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు డీ లిమిటేషన్‌పై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ హితం కోసం తీసుకొని వచ్చిన వన్‌నేషన్-వన్ ఎలక్షన్‌ను ప్రజల మద్దతుతో పార్లమెంటులో ఆమోదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపి జాతీయ కార్యదర్శి అనిల్ కె ఆంటోని, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

150 గజాలలోపు నివాసాలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, మే 3 (ఆంధ్రజ్యోతి) జీవో ఎంఎస్ నెంబరు 296, 388 చంద్రన్న పట్టాలు రిజిస్ట్రేసన్ హక్కుల కోసం అంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 30పై అవగాహన సదస్సు శనివారం సాయంత్రం తోటగరువులో గల శ్రీఎర్ని దుర్గమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ చంద్రన్న పట్టాల్లో తప్పులు సరిచేసుకోవచ్చన్నారు. అలాగే కొత్తగా పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారుడి ఇంటి వద్దకు సిబ్బంది వచ్చి సమగ్ర సర్వే చేస్తారని తెలిపారు. పలువురి సందేహాలను ఎమ్మెల్యే నివృత్తి చేశారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డివో సంగీత్ మాధుర్, తహసీల్దార్ పాల్ కిరణ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 9వ వార్డు నుంచి 13వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో మహిళలు, పట్టాదారులు పాల్గొన్నారు.

చందనోత్సవంలో గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే వెలగపూడి పరామర్శ

» ప్రభుత్వం తరపున ఆదుకుంటామంటూ భరోసా


రామారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సింహగిరిపై బుధవారం క్యూ లైన్లలో గోడ కూలిన దుర్ఘటనలో ఏడు మంది మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఆఘటనలో ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన పైలా రామారావు గాయపడిన వారిలో ఉన్నారు. ఈ క్రమంలో శనివారం బాలాజీనగర్‌లో ఉంటున్నరామారావు ఇంటికి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వెళ్లి ఆయన నుపరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చిల్డ్రన్ యోగా శిబిరం

వెంకోజీపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ యోగా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 31వ తేదీ వరకు చిల్డ్రన్ యోగా శిబిరం నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. యోగాపై మెలుకువలు, శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవడం, మానసిక ఆరోగ్యం వంటి వాటిని ఈ శిబిరంలో నేర్పించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 93980 19922/ 94944 01919/ 9985456150లో సంప్రదించాలని కోరారు.

పాకిస్తాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలి : బీజేవైఎం

సిరిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేయాలని బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు వంశీ యాదవ్ అన్నారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు 28 మంది భారతీయులను హతమార్చిన సంఘటన యావత్ భారతదేశాన్ని విస్మయానికి గురిచేసిందన్నారు. జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎస్ఎస్ వాసు మాట్లాడుతూ దేశ ద్రోహులు పాకిస్థాన్‌కు పారిపోయేవిధంగా తరిమికొట్టాలన్నారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఉంటారని కానీ, ఒక్క దేశద్రోహి కనపించడని... కానీ భారతదేశంలో పాకిస్థాన్‌కు మద్ధతు తెలిపే దేశద్రోహులు అడుగడుగున ఉన్నారన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు శ్రీహరికృష్ణ, సునీల్‌కుమార్, దామోదర్, సిద్ధార్థ, భార్గవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశ అవసరాల కోసం పరిశోధనలు

» సెంచూరియన్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు


మాట్లాడుతున్న సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : దేశ, సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు జరపాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించి పరిశోధన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు వచ్చాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు జరిపితే వారికి మంచి గుర్తింపుతో పాటు సమాజ అవసరాలు తీరుతాయన్నారు. కాలం చెల్లిన అంశాలపై పరిశోధనలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పలువురు పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వివాహేతర సంబంధమే కారణం..

» దాకమర్రి లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు
» హతురాలు మారికవలస రాజీవ్ గృహకల్పకు చెందిన వివాహిత


హత్యకు గురైన వెంకటలక్ష్మి (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం/ భీమునిపట్నం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలకలం రేపిన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధి దాకమర్రి శివారులోని ఫార్చ్యూన్ హిల్స్ వుడా లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న వ్యక్తే ఆమెను హత్య చేసినట్టు నిర్ధారించారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 38 ఏళ్ల మహిళ (వెంకటలక్ష్మి) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి మారికవలసలోని రాజీవ్ గృహకల్ప బ్లాక్ నంబర్-121లో ఎస్ఎఫ్-4లో నివాసం ఉంటుంది. ఒడిశాలోని రాయగడ జిల్లా కాంపోమల్లిగాంకు చెందిన శరాతి కాంతికుమార్ (25)కు మొదటిభార్య ఉండగానే రెండో వివాహం చేసుకున్నాడు. తొలి భార్య పిల్లలు తగరపువలసలో ఉంటుండగా, రెండో భార్యను నాలుగేళ్ల కిందట రాజీవ్ గృహకల్పలో మృతురాలు ఉంటున్న ఇంటి పక్కనే ఉంచాడు. ఈ క్రమంలో మృతురాలికి కాంతికుమార్‌కు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై రెండో భార్య గొడవ పడడంతో ఆమెను అదే కాలనీలోని మరో బ్లాక్‌కు మార్చాడు. ఇటీవల కాలంలో మృతురాలు తనతో ఎక్కువ సమయం గడపాలని ఒత్తిడి చేస్తోంది. అప్పటికే ఇద్దరు భార్యలతో గొడవలు జరుగుతుండడంతో మృతురాలిని ఎలాగైనా వదిలించుకోవాలని కాంతికుమార్ భావించాడు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీ రాత్రి 8 గంటల సమయంలో మృతురాలు వెంకటలక్ష్మికి ఫోన్ చేసి సిటీలోకి వెళదామని చెప్పాడు. దీంతో ఆమె పంక్షన్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లింది. కాంతికుమార్ ముందుగానే చాకుని తీసుకుని బైక్‌పై వెళ్లి మృతురాలిని ఎక్కించుకున్నాడు. తీరంలోని తెన్నేటి పార్కు వద్ద కాసేపు ఐస్‌క్రీమ్ తిన్నాక బైకులో పెట్రోల్ అయిపోయిందని బెంక్‌కు వెళ్లారు. కొంత పెట్రోల్‌ను బైక్‌లో వేయించి, మరికొంత తనతో తెచ్చుకున్న బాటిల్‌లో వేయించాడు. బాటిల్‌లో పెట్రోల్ ఎందుకని మృతురాలు ప్రశ్నించగా, తన ఇంటి వద్ద బైక్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్నారని, దీంతో ఉదయాన్నే డ్యూటీకి వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని చెప్పడంతో మృతురాలికి అనుమానం రాలేదు. అక్కడ నుంచి తిమ్మాపురం సమీపంలోని రామాద్రి బీచ్‌వద్దకు వెళ్లి నూడిల్స్ తిన్నారు. అనంతరం దాకమర్రి రఘు కాలేజీ రోడ్డులో టీ టైమ్ దగ్గర ఆగి ఇద్దరూ కాఫీ తాగారు. ఆ తరువాత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శారీరకంగా కలుద్దామని నమ్మించి ఆమెను ఫార్చ్యూన్‌లేఅవుట్‌లోకి తీసుకువెళ్లాడు. అక్కడకు వెళ్లాక చీకట్లో చాకుతో మృతురాలి మెడను కోసి హత్య చేశాడు. ఆ తరువాత ఆమె మెడలోని ఆభరణాలు, చెవిదిద్దులను తీసుకుని బాటిల్‌తో తెచ్చిన పెట్రోల్‌ను పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. ఆ మర్నాడు సగం కాలిన మహిళ మృతదేహం ఉన్నట్టు సమాచారం అందగానే సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నార్త్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో భీమిలి సీఐ తిరుమలరావు, ఆనందపురం సీఐ వాసునాయుడు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను విచారణ కోసం ఏర్పాటు చేశారు. ఘటనా స్థలిలో లభ్యమైన దుస్తులు, ఇతర వస్తువులు, ఆనవాళ్లను పోలీసులు సోషల్ మీడియా ద్వారా విడుదల చేయడంతో మృతురాలి ఆచూకీ లభ్యమైంది. మృతురాలి ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడైన కాంతికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ వెల్లడించారు. హత్యకు సంబంధించిన సమాచారం అందిన ఆరు గంటల వ్యవధిలోనే మృతురాలితో పాటు నిందితుడిని గుర్తించడం, నిందితున్ని అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

హౌసింగ్‌లో రిటైర్డు అధికారికి రీ పోస్టింగ్


» జిల్లా అధికారుల ప్రమేయం లేకుండానే..

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏపీ గృహని ర్మాణ సంస్థలో అధికారుల కొరతను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సుమారు రెండున్నరేళ్ల క్రితం పదవీ విరమణ చేసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీఆర్‌వీ ప్రసాదరావుకు తిరిగి పోస్టింగ్ ఇచ్చారు. ఏడాది కాలానికి ఒప్పందం మేరకు పోస్టింగ్ ఇస్తూ గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయజైన్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులను సమర్థంగా అమలు చేసే అనుభవం ఉన్నందున ప్రసాదరావుకు తిరిగి పోస్టింగ్ ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ప్రసాదరావును తిరిగి నియమించాలన్న దానిపై జిల్లా యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు పంపకపోయినా హౌసింగ్ ప్రధాన కార్యాలయం ఆమోదం తెలపడం గమనార్హం. టీడీపీలో కీలక నేత ప్రాపకంతో ప్రసాదరావుకు తిరిగి డీఈఈగా నియమించారనే వాదన వినిపిస్తోంది. ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే తూర్పు నియోజకవర్గ పరిధిలో ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రసాదరావుకు కేటాయిస్తూ హౌసింగ్ ఎండీ ప్రొసీడింగ్స్ ఇవ్వడం పట్ల జిల్లా కార్యాలయంలో ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'తూర్పు'లో విధుల నిర్వహణకు ఆదేశాలు తెచ్చుకున్న విషయం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కనీస సమాచారం లేదు. కాగా హౌసింగ్ కార్యాలయంలో అధికారుల కొరత ఉన్నమాట వాస్తమే అయినా గతంలో డీఈఈగా ప్రసాదరావు చేపట్టిన పలు ప్రాజెక్టుల అమలుపై అనేక ఆరోపణలున్నాయని ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 9వ వార్డులోని పెదగదిలి కమ్యూనిటీ హాలులో శనివారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టైలరింగ్‌లో నైపుణ్యం సంపాదించి, ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్ల సహాయంతో ఆదాయ వనరులు లభిస్తాయన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. 80 శాతం హాజరు ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరి గోవింద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, వార్డు కార్యదర్శి వెంకటరావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఒమ్మి పోలారావు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

ఆరిలోవ మే 3 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18 వరకూ జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహా సభలు జయప్రదం చేయాలని సమాఖ్య సహాయ కార్యదర్శి కె.సందీప్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆరిలోవలోని భగత్‌సింగ్ నగర్‌లో శనివార ఆయన ఆవిష్కరించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



అధికారికి చెక్కు అందజేస్తున్న దాతలు

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి విశాఖకు చెందిన చలసాని మాలిని కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. శనివారం ఆలయంలో అధికారులకు చెక్కు రూపంలో విరాళం మొత్తాన్ని అందజేశారు. ఇలా ఉండగా అమ్మవారి ఆలయంలో తులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

20న ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేసి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కర్మాగారంలో సమ్మె చేస్తామని సంఘ నాయకులు శనివారం జీఎం (హెచ్‌ఆర్) ఎం.మధుసూదన్‌కు నోటీసు ఇచ్చారు. ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని తొలగించరాదని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్న డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు. జీఎంను కలిసిన వారిలో అఖిలపక్ష నాయకులు జి.శ్రీనివాసరావు, రమణ, మంత్రి రవి, కె.వంశీకృష్ణ, అప్పన్న, అప్పారావు ఉన్నారు.

బైక్ దగ్ధం



కాలిపోతున్న బైక్

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని జిల్లా పరిషత్ జంక్షన్ సమీపంలో ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని పార్కు చేసి ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లాడు. ఆ వాహనం నుంచి నెమ్మదిగా పొగలు వస్తూ అందరూ చూస్తుండగానే క్షణాల్లో ఒక్కసారిగా వాహనానికి మంటలు అంటుకున్నాయి. సమీపం నుంచే చూస్తున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి విషయాన్ని తెలియజేయడంతో వారు వెంటనే వచ్చారు. కానీ అప్పటికే వాహనం చాలావరకు కాలిపోయింది.

రెండు కళాశాలల్లో నేడు నీట్

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆదివారం నీట్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్ష ఇన్విజిలేటర్లకు శనివారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని సీనియర్ అధ్యాపకుడు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.డి.దామోదర్ నిర్వహించారు. ఇన్విజిలేటర్ల చేపట్టాల్సిన విధులను కూలంకషంగా వివరించారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది.

జనసేన సభ్యత్వ కార్డుల పంపిణీ

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట 29వ వార్డు కన్నయ్యపేటలో జనసేన గుర్తింపు కార్డులను శనివారం ఆ పార్టీ నాయకుడు మన్యాల శ్రీనివాస్ పంపిణీ చేశారు. కొత్తగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. క్రియాశీల సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రమాద బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసారా నవ్వేద్దాం..

» నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



ఎంవీ సుబ్రహ్మణ్యం



సుడిగుండాలలో అమ్ముతావా...ప్రదర్శన (ఫైల్)

డాబాగార్డెన్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి, చికాకు, కోపం.. ఇలాంటి వాటిని దూరం చేసేందుకు మంచి మందు నవ్వు. మనసారా నవ్వుకుంటే అనేక రోగాలు మటుమాయమవుతాయన్నది పెద్దల సూచన. నవ్వులో ఉండే మజాను గ్రహించిన నగరవాసి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ ఎంవీ సుబ్రహ్మణ్యం 'ఫ్రెండ్స్ కామెడీ క్లబ్'ను నెలకొల్పి ప్రదర్శనల ద్వారా చాలామందిని నవ్విస్తున్నారు. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

తనతో పాటు పదిమందీ హాయిగా నవ్వుకునేలా ఏదైనా చేయాలని సంకల్పించిన సుబ్రహ్మణ్యం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ పేరుతో ఓ సంస్థను నెలకొల్పి దశాబ్దకాలంగా వివిధ రకాల ప్రదర్శనలు ఇస్తూ నవ్వులు పూయిస్తున్నారు. కళాకారులు, హాస్యప్రియులను సమన్వయపరిచి ప్రతీ నెల క్రమం తప్పకుండా మొదటి ఆదివారం విశాఖలోని పౌర గ్రంథాలయం, ఏయూ, అల్లూరి విజ్ఞాన కేంద్రం తదితర వేదికలపై మూడు గంటల పాటు హాస్య నాటిక ప్రదర్శనలు ఇస్తుంటారు. 'నవ్వుల హరివిల్లు' పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్లబ్ ద్వారా హాస్యనాటికలు, చిన్న చిన్న స్కిట్స్ ప్రదర్శిస్తున్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, విశాఖ హ్యూమర్ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, హైదరాబాద్ లాఫింగ్ క్లబ్, లాఫ్టర్స్ క్లబ్ తదితర పదకొండు క్లబ్స్ ప్రజలను నవ్వించేందుకు ప్రయత్నిస్తుంటాయి. అయితే ఎక్కువ శాతంలోని ఫ్రెండ్స్ కామెడీ, హ్యూమర్, హాస్యప్రియ తదితర క్లబ్‌లు నెల నెలా ప్రదర్శనలు ఇస్తుంటాయి. మరికొందరు కొన్ని కొన్ని సమయాల్లో మాత్రమే ప్రదర్శనలు ఇస్తుంటారు. ఔత్సాహిక కళాకారులను వెలికితీయడం, ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యమని అంటారు సుబ్రహ్మణ్యం. ప్రదర్శనలకు అయ్యే ఖర్చును సొంతంగా భరిస్తున్నట్లు చెప్పారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవంలో భాగంగా శనివారం స్థానిక బీఎస్‌ఆర్ భవనంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా రక్తదానం శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్మిక సంక్షేమ కమిషనర్ ధూళిపాళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే రక్తదానం చేయడం విధిగా మనమంతా గుర్తించాలన్నారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్తదానంతో పాటు అవయవదానం, దేహ దానాన్ని ప్రోత్సహించాలన్నారు. సీటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు చేపడుతున్న డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నావల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులకు అదనంగా థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలుకు (08547) ఈ నెల 7 నుంచి 28 వరకు, తిరుగు ప్రయాణంలో తిరుపతి-విశాఖ రైలుకు (08548) ఈ నెల 8 నుంచి 29 వరకు అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో రచయిత జ్యోతిర్మయి మళ్ల రాసిన 'చూపు ఎంత అలిసిందో' గజల్ సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విచ్చేసి గజల్ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం గజల్లు రాస్తూ, స్వరకల్పన చేసి పాడుతూ అందరికీ గజల్ రచనలో శిక్షణ ఇస్తూ చేస్తున్న కృషితో జ్యోతిర్మయి గజల్ చరిత్రలో ముఖ్యమైన భాగంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. గజల్ ప్రయాణం నిర్విరామంగా కొనసాగాలని అతిథులు ఆశీర్వదించారు. ప్రముఖ గజల్ కవి, సాహితీ విశ్లేషకులు బిక్కి కృష్ణ ఈ పుస్తకంపై సమీక్షను అందించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వి.వి.రమణమూర్తి, గౌరవ అతిథిగా డాక్టర్ బిక్కి కృష్ణ, ఆత్మీయ అతిథులుగా గంటి మురళి, ఎం.ఆదినారాయణ, శేఖరమంత్రి ప్రభాకరరావు, పి.కె.జయలక్ష్మి, బోర భారతిదేవి, జ్యోత్స్న గౌరవ అధ్యక్షులు చల్లా రాంబాబు, కోశాధికారి మళ్ల ప్రభాకరరావు, మాధవి, కె.రంగారావు, హేమలత, అనిత పాల్గొన్నారు.

గిరిజనులను మభ్యపెడుతున్న వైసీపీ: కిడారి

మహారాణిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 3 విషయంలో వైసీపీ నాయకులు గిరిజనులను మభ్యపెడుతున్నారని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం విశాఖలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఆ జీవో రద్దయ్యిందని, దీనిపై మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. అసెంబ్లీకి వెళ్లి ఈ విషయమై వారు ఎందుకు మాట్లాడటం లేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేసి పోరాటం చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో డీఎస్సీ ఎందుకు నిర్వహించలేకపోయారని ప్రశ్నించారు.

గెడ్డ మరమ్మతులకు శంకుస్థాపన

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి పైడిమాంబ కాలనీలో ప్రధాన గెడ్డ మరమ్మతులకు కార్పొరేటర్ ఎస్.రాజశేఖర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రూ.19.8 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు మళ్ల శంకరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీ వాసులకు ఇళ్లు నిర్మిస్తాం: వంశీకృష్ణ



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ, ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటున్న 56 మందికి పక్కా ఇళ్లు నిర్మించనున్నట్లు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన ఇందిరానగర్ కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో సమస్యలను తనకు చెబితే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు వేరే చోట నివాసానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించగా వారంతా అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, గొలగాని వీరారావు బుజ్జి, జడ్సీ రాము, నాయకులు అకిరెడ్డి జగదీష్, ఆళ్ల శ్రీనివాస్, కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, దువ్వి కాశీ ప్రసాద్, ఎంఎల్ఎన్ రావు, శ్రీకృష్ణ, తోట శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో జనవాణి

సీతంపేట, మే 3, (ఆంధ్రజ్యోతి): నగర జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనవాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు తెలపడానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వారి సమస్యలు తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లతో రోడ్డుపై వీరంగం

» దయానందనగర్‌లో ఘటన » సీపీ ఆదేశించేవరకు కదలని కంచరపాలెం పోలీసులు

కంచరపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గొడవలు సర్వసాధారణమైనా పోలీసులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకపోవడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఇటీవల బర్మాక్యాంప్‌లో జరిగిన దాడిని మరువకముందే, ఐదురోజుల క్రితం 56వ వార్డు పరిధి చాకలి గెడ్డ దయానందనగర్ ప్రాంతంలో ఇద్దరు యువకులు మద్యం తాగి కత్తులు, కర్రలు, ఇనుపరాడ్లతో నడిరోడ్డు మీదే వీరంగం సృష్టించడంతో స్థానికులు భయాందోనకు గురయ్యారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక చాకలి గెడ్డ దయానంద నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎం.కనకరాజు, శ్రీనివాసరావులపై వారి ఇంటి పక్కన ఉంటున్న శివకుమార్, స్వామి, సంధ్యారాణి కలిసి గత నెల 27న రాత్రి 9.30 గంటల సమయంలో దాడికి పాల్పడ్డారు. శివకుమార్ కనకరాజుపై కత్తితో దాడికి ప్రయత్నించగా స్వామి కర్ర, ఇనుపరాడ్డుతో వారి ఇంటి మీదకి వెళ్లాడు. దీంతో కనకరాజు, శ్రీనివాసరావులు భయంతో పరుగులు తీశారు. ఈ దాడికి పాల్పడిన శివకుమార్, స్వామి మద్యం తాగి రోజూ ఇలానే చేస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. బాధితులు కనకరాజు, శ్రీనివాసరావులు కంచరపాలెం పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో శుక్రవారం బాధితులు నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించారు. ఆయన ఆదేశించడంతో కంచరపాలెం పోలీసుల్లో కదలిక వచ్చి నిందితులపై శనివారం కేసు నమోదు చేశారు.

73,000

... 1వ పేజీ తరువాయి

తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇటువంటి కుటుంబాల్లో పిల్లలకు మంచి చదువు అందించడం, ఉద్యోగాల కోసం నాణ్యమైన శిక్షణ ఇప్పించడం, వారు నివసిస్తున్న ఇంటిలో చక్కని జీవనానికి వీలుగా వసతులు కల్పించడం, ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన ఆర్థిక సాయం చేయడం, ఇతరత్రా ప్రోత్సాహం అందజేసేందుకు మార్గదర్శకులను ఎంపికచేయాలి. దీనికి సంబంధించి ప్రభుత్వం అన్ని జిల్లాల మాదిరిగా విశాఖ జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో ప్రధానంగా నగరంలో పారిశ్రామికవేత్తలు, పెద్ద వ్యాపారులు, బిల్డర్లు, వైద్యులు, లాయర్లు, ఇతరత్రా ఉన్నత వర్గాలు, ఎన్ఐఆర్‌లను మార్గదర్శకులుగా గుర్తించే బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్నత వర్గాలు, పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ త్వరలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బంగారు కుటుంబాలకు ఏ విధంగా ఆదుకోవాలి అనేదానిపై మార్గదర్శకులకు దిశానిర్దేశం చేయనున్నారు.

కార్యరూపం దాల్చని ఓషన్ డెక్

... 1వ పేజీ తరువాయి

పార్కు వెనుక తీరంలో 50 మీటర్లు, సముద్రంలో మరో 50 మీటర్ల పొడవున మొత్తం 100 మీటర్ల డెక్ ఒకటి నిర్మిస్తారు. అక్కడే రెండు అంతస్థుల భవనం వస్తుంది. డెక్ నుంచి సముద్రం లోపలకు నడుచుకుంటూ వెళితే...అక్కడ 60 మంది కూర్చొనేలా రెస్టారెంట్ ఉంటుంది. రెండు అంతస్థుల భవనంలో పై అంతస్థను వ్యూ పాయింట్‌గా అభివృద్ధి చేసి సందర్శకులను అక్కడకు అనుమిస్తారు. అక్కడి నుంచి సముద్రం, పరిసర ప్రాంతాలు కనువిందు చేస్తాయి. అక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొంటూ స్నాక్స్ తినే ఏర్పాట్లు కూడా ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు రూ.7.8 కోట్లు అవుతుందని అంచనా వ్యయంతో వేశారు. డిజైన్లు కూడా తయారుచేశారు. పూర్తయితే వీఎంఆర్‌డీఏ తరపున పర్యాటకులకు మరో మంచి ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తుంది.

నిండు ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

... 1వ పేజీ తరువాయి

చేయలేదు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు రూ.300 క్యూలైన్‌ను అక్కడి నుంచే పక్కమెట్ల మీదుగా మళ్లించారు. ఆ ప్రాంతంలో నిర్మించిన గోడే వర్షానికి కూలిపోయింది. కమిటీ విచారణలో ఇదే విషయం తేటతెల్లమైంది.

విధుల కేటాయింపులో వైఫల్యం

చందనోత్సవంలో సేవలు అందించానికి అటు అమలాపురం నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఉన్న ఆలయాల నుంచి వందలాది మందిని డిప్యుటేషన్‌పై సింహాచలం రప్పించారు. వారంతా చందనోత్సవానికి రెండు రోజుల ముందే ఇక్కడకు చేరుకున్నారు. అందరికీ డ్యూటీ పాయింట్లు వేశారు. అయితే అక్కడ ఎటువంటి విధులు నిర్వహించాలనే దానిపై ఎవరూ మార్గదర్శనం చేయలేదు. ఇలాంటి సందర్భాల్లో ఆలయ ఈఓ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు...ఓ సమావేశం ఏర్పాటు చేసి, ఆయా ఉద్యోగులకు ఎవరు ఏయే పనులు చేయాలో వివరించాలి. గతంలో అలాగే చేసేవారు. కానీ ఈసారి సమావేశం నిర్వహించలేదు. ఏ పనులు చేయాలో ఎవరికీ చెప్పలేదు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ తనకు బాధ్యతలు ఏమీ ఇవ్వలేదని కార్యాలయానికే పరిమితమయ్యారు. కమిషనర్, ఈఓలు ఉత్సవం ముందురోజు ఎవరికీ అందుబాటులో లేరు. దాంతో డిప్యుటేషన్‌పై వచ్చిన వందలాది మంది ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దిష్టిబొమ్మల్లా నిల్చోవలసి వచ్చింది. ఇది కూడా కమిటీ దృష్టికి వచ్చింది. ఎటువంటి బాధ్యతలు అప్పగించనప్పుడు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌ను ఎందుకు నియమిస్తున్నట్టు? అని కూడా ప్రశ్నించినట్టు సమాచారం.

చందనోత్సవ నిర్వహణలో లోపాలు అనేకం!

... 1వ పేజీ తరువాయి

ఎటువంటి సమాచారం లేదు. సాయంత్రం ఐదు గంటల నుంచి వేయి రూపాయల టికెట్లు ఒకటి, రెండు ఇవ్వడం ప్రారంభించి రాత్రి 12 గంటల వరకూ అంటే చందనోత్సవం ఇంకో రెండు గంటల్లో ప్రారంభం అవుతుందనేంత వరకూ కొండపై ఈఓ కార్యాలయం వద్ద జారీచేస్తూనే ఉన్నారు. టికెట్లను అంతవరకూ ఇవ్వకుండా ఉండడంలో ఆంతర్యం ఏమిటో ఆలయ ఈఓ, ఇన్‌చార్జి కమిషనరే చెప్పాలి.

"నాకు ఇక్కడి సంగతులు తెలుసు... నేను చూసుకుంటా"

చందనోత్సవం టిక్కెట్లను ప్రజా ప్రతినిధులకు ఎక్కువ సంఖ్యలో ఇవ్వడం ఎప్పటి నుంచో ఉంది. తొలుత ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, ఎంపీలకు తలా కొన్ని ఇవ్వాలని సమావేశంలో ప్రతిపాదించారు. దానికి ముందు అంతా ఓకే అన్నారు. ఆ తరువాత అలా ఇవ్వలేమని దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ తేల్చిపారేశారు. ఇబ్బంది అవుతుందేమోనని జిల్లా అధికారులు అంటే...'నాకు ఇక్కడి సంగతులన్నీ తెలుసు..నేను చూసుకుంటా...ఇక్కడే చాలాకాలం పనిచేశా. చాలా చందనోత్సవాలు చేశా' అంటూ ఆయన అన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ తరువాత కేవలం విశాఖ జిల్లా ఎమ్మెల్యేలకు మాత్రమే పరిమిత సంఖ్యలో అంటే ఏడు అంతరాలయ టికెట్లు ఇస్తామని ఆయన స్పష్టంచేశారు. అది కూడా రాత్రి 10 గంటల తరువాత ఆయా ఎమ్మెల్యేల మనుషులు కొండపైకి వెళితే. దీనిపై ఈఓ, ఇన్‌చార్జి కమిషనర్‌తో పీఏలు మాట్లాడడానికి ప్రయత్నిస్తే వారిద్దరూ అందుబాటులో లేరు. నగరంలో ప్రముఖ కార్పొరేషన్ చైర్మన్ పీఏ రాత్రి 8.30 గంటలకు కలెక్టరేట్ నుంచి లెటర్ తీసుకొని ఈఓ కార్యాలయానికి వెళితే 10 గంటలకు టికెట్లు ఇచ్చారు. అధికారుల తీరు నచ్చక కొందరు దర్శనాలకు వెళ్లలేదు. దర్శనం టిక్కెట్లను అంత రాత్రి వరకూ ఎందుకు విక్రయించాల్సి వచ్చింది? అంత ఉత్కంఠ సృష్టించాల్సిన అవసరం ఏమిటి? అనేది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

సొత్తు కోసమే వృద్ధ దంపతుల హత్య

... 1వ పేజీ తరువాయి

కత్తి కొనుగోలుచేసి నేరుగా లక్ష్మి ఇంటికి వెళ్లాడు. బంగారం ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మెడను కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఆభరణాలను తెంచుకుని వెళ్లిపోతుండగా, మరో గదిలో ఉన్న లక్ష్మి భర్త యోగేంద్రబాబు రావడంతో ఆయన్ను కూడా హత్యచేశాడు. అనంతరం యోగేంద్రబాబుకు చెందిన స్కూటీపై వెళ్లిపోయాడు. హత్య చేసిన తర్వాత డైమండ్ పార్కు సమీపంలోని సాయిరాం డార్మెటరీకి వెళ్లి రెండు గంటలు ఉన్నాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి స్కూటీని పార్కింగ్‌లో వదిలేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్, అక్కడి నుంచి పూరీ వెళ్లిపోయాడు. చోరీచేసిన బంగారు ఆభరణాలను అక్కడ తన సోదరి చేతికి ఇచ్చి అమ్మి తనకు డబ్బులు తేవాలని కోరాడు. ఆమె బంగారం దుకాణానికి వెళ్లి ఆభరణాలను కరిగించి రూ.4.28 లక్షలకు విక్రయించింది. ఆ సొమ్మును తన సోదరుడైన ప్రసన్నకుమార్‌మిశ్రాకు ఇచ్చింది. ఈ హత్య కేసు దర్యాప్తులో భాగంగా మృతురాలు లక్ష్మి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించారు. కాల్ డేటాను తీశారు. కొన్ని నంబర్లు ఆమె డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఓ నంబర్ గల వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతనెల 21న తాను దువ్వాడ మార్క్స్ షోరూమ్ వద్ద ఉండగా సుమారు 56 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి వచ్చి కాగితంపై రాసుకున్న నంబర్‌కు తన ఫోన్ నుంచి కాల్ చేసినట్టు చెప్పారు. అక్కడవున్న సీసీ కెమెరాలను పరిశీలించగా ప్రసన్నకుమార్‌మిశ్రా ఫోన్ మాట్లాడినట్టు నమోదైంది. ఆ ఫొటోను దువ్వాడ ప్రాంతంలో పలువురికి చూపించగా ప్రసన్నకుమార్‌మిశ్రాగా, అతనిస్వస్థలం ఒడిశా అని నిర్ధారించడంతోపాటు వారివద్ద ఉన్న ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. ఆ ఫోన్ నంబర్ రాణిశర్మ అనే మహిళ పేరుతో ఉన్నట్టు గుర్తించారు. కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో 15 మంది సీఐలు, వంద మంది సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఒడిశాలో ఉన్న ప్రసన్నకుమార్‌మిశ్రాను అదుపులోకి తీసుకున్నాయి. మొదట తాను ఇద్దరినీ హత్య చేయలేదని చెప్పాడు. గంపల లక్ష్మికి తనతో వివాహేతర సంబంధం ఉందని తెలిసి ఆమెను భర్త యోగేంద్రబాబు హత్య చేస్తే, తాను అతడ్ని హతమార్చినట్టు చెప్పాడు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొత్తుకోసం లక్ష్మిని తాను హత్యచేసి వెళ్లిపోతుండగా యోగేంద్రబాబు చూడడంతో ఆయన్ను కూడా హత్యచేసినట్టు అంగీకరించాడు. నిందితుడు గతంలో యూఏఈలో ఉన్నప్పుడు చోరీకి పాల్పడి, ఐదేళ్ల జైలుశిక్ష అనుభవించాడని, విడుదలైన తర్వాత ఇండియాకు వచ్చి విశాఖలో నివాసం ఉంటున్నాడని సీపీ వివరించారు. డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతి, లతామాధురి, ఏసీపీలు త్రినాథరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణం, చందనోత్సవం పురస్కరించుకుని గత నెల 7వ తేదీ నుంచి రద్దు చేసిన ఆర్జిత సేవలను శనివారం నుంచి పునఃప్రారంభించారు. ఈమేరకు వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నిత్య కల్యాణం జరిపారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు



వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు.ఆయనకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత అధికారులు శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన మల్ల భాస్కరరావు దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,10,116లను నగదు రూపంలో పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్)కు శనివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో ప్రముఖులు

అక్కయ్యపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏడో జాతీయ చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ క్రీడాకారులను శనివారం బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురాం, ఇతర ప్రముఖులు అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఏపీ నుంచి అన్ని కేటగిరీలలో 50 మంది బాక్సర్లు పాల్గొన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా బి.వాసు, మేనేజర్‌గా విజయ భాస్కర్ రెడ్డి (కడప), రిఫరీగా బి.కనకరాజు, ఇతర కోచ్‌లుగా ఏపీ బీడీఎఫ్ఐ అధ్యక్షుడు యల్లపు రఘురాం, సెక్రటరీగా వి.అమ్మోరు వ్యవహరించారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీల్లో పాల్గొన్న బాక్సింగ్ క్రీడాకారులకు 34 బంగారు, 14 వెండి పతకాలు లభించాయి. చాంపియన్ షిప్ సాధించిన వారికి నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, డాక్టర్ గొట్ల కృష్ణారెడ్డి, అడ్వయిజర్ సాయి సతీష్, పి.గణేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఆర్‌వోసీ రుబిన్‌లు సత్కరించి అభినందించారు.

రైల్వేకాలనీలో డీఆర్ఎం తనిఖీలు



డాల్ఫిన్ నోస్ రైల్వేకాలనీలో మురుగు కాలువను పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల వసతి గృహాలను డీఆర్ఎం లలిత్ బొహ్రా శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో పర్యటించి వసతులు, పారిశుధ్యం, విద్యుత్, నీటి సరఫరా, ఇతర సౌకర్యాల నిర్వహణను పరిశీలించారు. నివాసితులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఇళ్లల్లోకి వెళ్లి సదుపాయాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశారు. కాలనీలలో ఉండే నివాసితులకు పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, భద్రత వంటి ప్రధాన అవసరాలను సమకూర్చడంలో ఎటువంటి లోపం తలెత్తకూడదని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించి జీవన నాణ్యతను పెంపొందించే విధంగా సేవలందించాలని సూచించారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ జగదీష్, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ అప్పారావు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఉభయదేవేరులతో పూజలందుకున్న శ్రీవారు

శ్రీవారికి సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాస శనివారాన్ని పురస్కరించుకుని షీలానగర్ ఎస్బీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. వేకువ జామున శ్రీవారిని పలు రకాల పుష్పాలతో వేదపండితులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని ఆశీనులను చేసి వేదపండితులు పుష్పాలతో శ్రీవారికి సహస్రనామార్చన, నక్షత్ర హారతి, కుంభహారతితో పాటు విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై గల కల్యాణ వెంకన్న స్వామి ఆలయంలో శ్రీవారికి పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన గావించారు. సాయంత్రం సామూహిక విష్ణుసహస్రనామార్చన, భక్తిగీతాలాపన, ప్రసాద వితరణ చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ యాజమాన్యం యాజమాన్యం శనివారం ఉత్తర్వులు విడుదలచేసింది. స్కిల్ కార్మికులకు రోజుకు రూ.25, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ.21, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.19 పెంచింది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలులోకి వస్తామని పేర్కొంది.

స్టీల్‌ప్లాంటులో ఓబీసీ సంఘం వెబ్‌సైట్ ప్రారంభం



కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్ ప్రసాద్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో వివిధ సంఘాలు అందిస్తున్న సేవలు విశేషమైనవని డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎం ప్రసాద్ అన్నారు. ప్లాంట్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లను శనివారం ఆయన హెచ్‌ఆర్‌డీ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమల్లో స్టీల్‌ప్లాంటులోనే పెద్ద ఓబీసీ సంఘం ఉందని, దీని ద్వారా సభ్యులకు విశేష సేవలందించడం మంచి విషయమన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు బి.అప్పారావు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, వైఎల్ నాయుడు, సింహాచలం, శశిభూషణరావు, కామేశ్వరరావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)

● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళదుంపలు 22, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 34, కంద 80, గోరుచిక్కుడు 30, దేముడు చిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

భద్రతపైనే పరిశ్రమల ప్రగతి ఆధారం

కేంద్ర మాజీ ఈఎస్ఐ కమిషనర్ బీకే సాహు

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర పరిశ్రమల్లో భద్రత చాలా ముఖ్యమని, పరిశ్రమల ప్రగతి భద్రతపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర మాజీ ఈఎస్ఐ కమిషనర్ బీకే సాహు అన్నారు. ఏఐటీయూసీ ప్లాంట్ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో విజన్ జీరో విధానంతో ప్రమాదాల నివారణ అనే అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడు బంగారు భద్రత సూత్రాల ఆధారంగా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్మికుడు నాయకత్వం వహించడం, ప్రమాదాలను ముందుగా గుర్తించడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సురక్షిత పని ప్రదేశం వంటివి చూసుకోవాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీకే సాహు

అప్రమత్తంగా విధులు నిర్వహిస్తే అన్ని విధాల మంచిదన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేశ్ మాట్లాడుతూ భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే ఏ విధంగా రక్షణ పొందాలో తెలుసుకోవాలన్నారు. ఉక్కు కర్మాగారం భద్రతా విభాగం సీజీఎం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాంటును జీరో ప్రమాద ప్రదేశంగా మార్చేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, పీవీ రమణమూర్తి, కొమ్మినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం

దాకమర్రి లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసుని ఛేదించిన పోలీసులు

హతురాలు మారికవలస రాజీవ్ గృహకల్పకు చెందిన వివాహిత

అదే ప్రాంతంలో ఉంటున్న వ్యక్తితో వివాహేతర సంబంధం

నిందితుడికి ఇద్దరు భార్యలు..

తనతో ఎక్కువ సమయం ఉండాలని మృతురాలి ఒత్తిడి

ఆమెను వదిలించుకునేందుకు పథకం ప్రకారం హత్య

విశాఖపట్నం/భీమునిపట్నం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలకలం రేపిన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధి దాకమర్రి శివారులోని పార్ర్యాన్ హిల్స్ వుడా లేఅవుట్‌లో సగం కాలిన మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. మృతురాలితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న వ్యక్తే ఆమెను హత్య చేసినట్టు నిర్ధారించారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 38 ఏళ్ల మహిళ (వెంకటలక్ష్మి) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమారులతో కలిసి మారికవలసలోని రాజీవ్ గృహకల్ప బ్లాక్ నంబర్-121లో ఎస్ఎఫ్-4లో నివాసం ఉంటుంది. ఒడిశాలోని రాయగడ జిల్లా కాంపోమల్లిగాంకు చెందిన శరాతి కాంతికుమార్ (25)కు మొదటిభార్య ఉండగానే రెండో వివాహం చేసుకున్నాడు. తొలి భార్య, పిల్లలు తగరపువలసలో ఉంటుండగా, రెండో భార్యను నాలుగేళ్ల కిందట రాజీవ్ గృహకల్పలో మృతురాలు ఉంటున్న ఇంటి పక్కనే ఉంచాడు. ఈ క్రమంలో మృతురాలికి కాంతికుమార్‌కు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై రెండో భార్య గొడవ పడడంతో ఆమెను అదే కాలనీలోని మరో బ్లాక్‌కు మార్చాడు. ఇటీవల కాలంలో మృతురాలు తనతో ఎక్కువ సమయం ఉండాలని ఒత్తిడి చేస్తోంది. అప్పటికే ఇద్దరు భార్యలతో గొడవలు జరుగుతుండడంతో మృతురాలిని ఎలాగైనా వదిలించుకోవాలని కాంతికుమార్ భావించాడు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీ రాత్రి 8 గంటల సమయంలో మృతురాలు వెంకటలక్ష్మికి ఫోన్ చేసి సిటీలోకి వెళదామని చెప్పాడు. దీంతో ఆమె ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లింది. కాంతికుమార్ ముందుగానే చాకుని తీసుకుని బైక్‌పై వెళ్లి మృతురాలిని ఎక్కించుకున్నాడు. తీరంలోని తెన్నేటి పార్కు వద్ద కాసేపు ఐస్‌క్రీమ్ తిన్నాక బైకులో పెట్రోల్ అయిపోయిందని బెంక్‌కు వెళ్లారు.



హత్యకు గురైన వెంకటలక్ష్మి (ఫైల్ ఫొటో)

కొంత పెట్రోల్‌ను బైక్‌లో వేయించి, మరికొంత తనతో తెచ్చుకున్న బాటిల్‌లో వేయించాడు. బాటిల్‌లో పెట్రోల్ ఎందుకని మృతురాలు ప్రశ్నించగా, తన ఇంటి వద్ద బైక్ నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్నారని, దీంతో ఉదయాన్నే డ్యూటీకి వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని చెప్పడంతో మృతురాలికి అనుమానం రాలేదు. అక్కడ నుంచి తిమ్మాపురం సమీపంలోని రామాద్రి బీచ్ వద్దకు వెళ్లి నూడిల్స్ తిన్నారు.

అనంతరం దాకమర్రి రఘు కాలేజీ రోడ్డులో టీ టైమ్ దగ్గర ఆగి ఇద్దరూ కాఫీ తాగారు. ఆ తరువాత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శారీరకంగా కలుద్దామని నమ్మించి ఆమెను పార్ర్యాన్‌లేఅవుట్‌లోకి తీసుకువెళ్లాడు. అక్కడకు వెళ్లాక చీకట్లో చాకుతో మృతురాలి మెడను కోసి హత్య చేశాడు. ఆ తరువాత ఆమె మెడలోని ఆభరణాలు, చెవిదిద్దులను తీసుకుని బాటిల్‌తో తెచ్చిన పెట్రోల్‌ను పోసి నిప్పంటించి వెళ్లిపోయాడు. ఆ మర్నాడు సగం కాలిన మహిళ మృతదేహం ఉన్నట్టు సమాచారం అందగానే సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నార్త్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో భీమిలి సీఐ తిరుమలరావు, ఆనందపురం సీఐ వాసునాయుడు నేతృత్వంలో ప్రత్యేక బృందాలను విచారణ కోసం ఏర్పాటు చేశారు.

ఘటనా స్థలిలో లభ్యమైన దుస్తులు, ఇతర వస్తువులు, ఆనవాళ్లను పోలీసులు సోషల్ మీడియా ద్వారా విడుదల చేయడంతో మృతురాలి ఆచూకీ లభ్యమైంది. మృతురాలి ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడైన కాంతికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ వెల్లడించారు. హత్యకు సంబంధించిన సమాచారం అందిన ఆరు గంటల వ్యవధిలోనే మృతురాలితో పాటు నిందితుడిని గుర్తించడం, నిందితున్ని అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

నీళ్లట్యాంకులోకి దూకి మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్టీసీ డిపో కొత్తనక్కవానిపాలెం ఏరియాలో ఉన్న జీవీఎంసీ ప్రధాన మంచినీటి పెద్దట్యాంక్‌లో శనివారం అందరూ చూస్తుండగానే మతిస్థిమితం లేని సరగడ ప్రసాద్ రెడ్డి (40) ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో మంచినీటి ట్యాంక్‌కు సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై కొందరు టీ తాగుతూ.. అటుగా ట్యాంక్‌వైపు చూస్తున్నారు... ఇంతలోనే ఓ వ్యక్తి ట్యాంక్‌పైకి ఎక్కి.. వేగంగా చుట్టూ పరుగిడుతూ ఒక్కసారిగా అదృశ్యమయ్యాడు. దీనిని గమనించిన వారు ఏదో జరుగుతోందనుకునేలోపే సదరు వ్యక్తి.. ట్యాంక్‌లోకి దూకేశాడు. పలువురు వెంటనే ట్యాంక్ వద్దకు వచ్చి అక్కడున్న సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు. వెంటనే సిబ్బంది పెద్దపెద్ద లైట్‌లు తీసుకొని వచ్చి ట్యాంక్‌లోకి చూడగా నీటి అడుగుభాగాన ఆ వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే నీటిని బయటకు పంప్‌ల ద్వారా తోడేసి, ఆ తరువాత ఇద్దరిని ట్యాంక్‌లోకి దించి మృతదేహానికి తాళ్లు కట్టి పోలీసుల సమక్షంలో బయటకు తీశారు. 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్, స్థానికులు, జీవీఎంసీ సిబ్బంది అక్కడకు వచ్చారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ ట్యాంక్‌కు లీక్‌లు ఉన్నాయా...? అని తెలుసుకొనేందుకు నీటిని నింపారు. ఇందులోనే ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం పలువుర్ని కలచివేసింది. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పెందుర్తి,మే 3 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు ఆలయంలో ఉదయం, సాయంత్రం పలు కార్యక్రమాలను చేపడతారు. 5వ తేదీ సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8వ తేదీ సాయంత్రం తిరువీధి ఉత్సవం, వేంకటాద్రి ఆలయం నుంచి చినముషిడివాడ సప్తగిరినగర్‌లో గల అలివేలు మంగాదేవి ఆలయం వరకు స్వామి రథోత్సవం జరుగుతుంది. 9న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పుష్పయాగం, ధ్వజావరోహణం, ఋత్విక్ సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కార్మిక సంక్షేమమే ఇంటక్ ధ్యేయం

ఇంటక్ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఇంటక్ ముందుకు సాగుతుందని యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం టౌన్‌షిప్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనియన్ స్థాపన నుంచి ఇప్పటివరకు ఎన్నో పోరాటాలు చేసి కార్మిక హక్కులతో పాటు స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం ఎంతో కృషి చేస్తున్నామన్నారు. యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఇంటక్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో కార్మిక సంక్షేమానికి ఎంతో కృషి చేశామని, అయితే ప్రస్తుతం కార్మిక వర్గం పలు సౌకర్యాలను కోల్పోయిందని వాటిని తిరిగి సాధించేందుకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి బీఎన్ రాజు, నాయకులు కొమ్ము ప్రసాద్, జి.ప్రభాకర్ రెడ్డి, ఎస్ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ జెండా ఎగురవేస్తున్న మంత్రి రాజశేఖర్

మల్కాపురం: శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో జాతీయ ఇంటక్ 79వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడి గాంధీ విగ్రహానికి జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. దాదాపు అన్ని కంపెనీలలో ఇంటకే నాయకత్వం వహిస్తుందన్నారు. హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యనిర్వహణ అధ్యక్షులు ఎస్.తాతబాబు, రాజేష్, రాజుయాదవ్, మజ్జి సోమనాథ్, అభిమానులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: దేశంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణతో పాటు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కృషి చేసేది ఇంటక్ మాత్రమేనని బెల్ హెచ్‌పీవీపీ ఇంటక్ సీనియర్ నాయకులు కేవి రమణ పేర్కొన్నారు. ఇంటక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్ మెయిన్ గేటు ఎదుట జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి బాబూరావు, జీటీపీ ప్రకాశ్, వి.ఆనందరావు, పి.ఆనందకుమార్, మురళీశ్వరరావు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా'ను కలిసిన డీసీసీబీ చైర్మన్

గాజువాక, మే 3 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ మరింత ప్రగతి సాధించేందుకు కృషి చేయాలని, అందుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని పల్లా పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవిని ఇచ్చారని, డీసీసీబీకి వన్నె తెచ్చేలా చూస్తానని కోన తాతారావు అన్నారు. అనంతరం పల్లాను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని కోన తాతారావు అందజేశారు.



'పల్లాను' సత్కరిస్తున్న కోన తాతారావు

డ్రోన్‌తో మందుబాబుల ఆటకట్టు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 35 మందిపై కేసులు

పెందుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యం తాగుతున్న వారిని డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. శనివారం వివిధ ప్రాంతాల్లో 35 మందిపై కేసులు నమోదు చేశారు. సీఐ సతీశ్ కుమార్ ఆదేశాలతో డ్రోన్ కెమేరాలతో పోలీసులు నిఘా వేసి బహిరంగ స్థలాల్లో మందుబాబులను పట్టుకున్నారు.

ఘనంగా పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

మల్కాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే హక్కులు సొంతం కావాలంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం అవసరమని జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం అనేది పదునైన కత్తి లాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవడం మనపైనే ఆధారపడి ఉందన్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, జాతీయ సేవా పథకం వలంటీర్లు పాల్గొన్నారు.

'వీధి లైట్ల సమస్య పరిష్కారానికి కృషి'

అగనంపూడి, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి లైట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం, పరిసర ప్రాంతాల్లో ఆయన దగ్గరుండి కొత్త లైట్లను ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో దశలవారీగా వీధి లైట్లను పూర్తి స్థాయిలో అమర్చేలా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పాండా వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట స్థానిక నాయకుడు గల్లా రాజు, తదితరులు ఉన్నారు.

దేశ అవసరాల కోసం పరిశోధనలు

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల, మే 3(ఆంధ్రజ్యోతి): దేశ, సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు జరపాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పరిశోధన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు వచ్చాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై పరిశోధనలు జరిపితే వారికి మంచి గుర్తింపుతోపాటు సమాజ అవసరాలు తీరుతాయన్నారు. కాలంచెల్లిన వాటిపై పరిశోధనలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పలువురు పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డీఎన్ రావు

ఒకే దేశం..ఒకే ఎన్నికలు దేశ ప్రగతికి దోహదం

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

మద్దిలపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం..ఒకే ఎన్నికలు దేశప్రగతికి దోహదం చేస్తాయని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఏయూ వైవీఎస్ ఆడిటోరియంలో ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' చర్చా వేదికలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు.దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా మూడు అంశాల్లో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) నివేదిక ప్రకారం 2019 ఎన్నికల్లో రూ.60 వేల కోట్లు ఖర్చయిందన్నారు. ఒక ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.30 నుంచి రూ.100 కోట్లు వరకు ఖర్చు అవుతున్నట్టు సీఎంఎస్ నివేదికలు తెలుపుతున్నాయన్నారు. 2014 ఎన్నికలతో పోల్చితే 2019లో మూడు రెట్లు ఎన్నికల ఖర్చు పెరిగినట్టు సీఎంఎస్ నివేదించిందన్నారు. ముఖ్యంగా ఎప్పుడు పడితే అప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందన్నారు. పీఎం మోదీకి ఉన్న చరిష్మాకి భయపడి జాతీయ పార్టీలు 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'కు అభ్యంతరం తెలుపుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపి జాతీయ కార్యదర్శి అనిల్ కె ఆంటోని, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ పెదగంట్యాడ కార్యదర్శిగా దుర్గారావు

పెదగంట్యాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పెదగంట్యాడ మండల కార్యదర్శిగా దుర్గారావు ఎన్నికయ్యారు. ఇక్కడి పోతిన సన్యాసిరావు భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో నగరంలో జరగనున్న సీపీఐ 25వ జిల్లా మహా సభలను అందరూ విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

గోపాలపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఓపీతో పాటు గర్భిణులకు ప్రసవ సేవలు అందిస్తుండడంతో రోగుల తాకిడి పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రూ.11 లక్షలతో అదనంగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి సీఎస్ఆర్ ఫండ్ అందజేసిన కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ బృందానికి గణబాబు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ పి.శంకర ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.సుజాత, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, కమల్ ఫౌండేషన్ ప్రతినిధి డీస్ రాయ్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్ సమీప సుందరయ్య కాలనీలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ పదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశాక గారెలు, తమలపాకులతో అలంకరించి సింధూర పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఏపీ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు, జనసేన నాయకుడు కరణం కనకారావు, పప్పు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.